


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States




సంపుటి : 23 | సంచిక : 125 | ది.21-7-2024 | విజయవాడ | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

# సివిల్స్ లో తెలంగాణ జెండా ఎగరేయాలి

● జాతీయ స్థాయి పరీక్షల్లోనూ మన సత్తా చాటాలి ● "రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం" తో సివిల్స్ ఆశావహులకు చేయూత ● సింగరేణి సహకారంతో వినూత్న పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ● సివిల్స్ మెయిన్స్ రాసే అర్హులందరికీ లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహకం ● ఈ ఏడాది నుండే అమలు ● 2023 సివిల్స్ విజేతలు, 2024లో మెయిన్స్ రాసే అభ్యర్థులు హాజరు ● సివిల్స్ ఆశావహులకు ప్రోత్సాహక పథకం ప్రారంభించడంపై పలువురి హర్షం





**హైదరాబాద్,జూలై 20 (వార్తాప్రభ) :** సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన తెలంగాణ అభ్యర్థులకు శుభవార్త. సింగరేణి సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు పాసైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థుల్లో అర్హులకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించే రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శనివారం ఉదయం ప్రగతి భవన్ లో ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణకు చెందిన 2023 సివిల్స్ విజేతలు, 2024లో మెయిన్స్ రాసే అభ్యర్థులను ఉద్దేశించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల కోసం తెలంగాణ పోరాటం జరిగిందని.. ఎందరో యువత త్యాగాల పునాదులపై సొంత రాష్ట్రం కల సాకారమైందన్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్ను ప్రవేశ పెడుతున్నట్లు ప్రకటించారు. అలాగే తెలంగాణ యువతలో ప్రతిభకు కొరవ లేదని, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లోనూ తెలంగాణ సత్తాను చాటాలన్నారు. ముఖ్యంగా సివిల్స్ లోనూ ఎక్కువ మంది విజయం సాధించాలన్న ఉద్దేశంతో సింగరేణి సంస్థ సహకారంతో "రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. ప్రిలిమినరీ పరీక్ష లో విజయం సాధించిన వారు మెయిన్స్ కోచింగ్ కోసం అవసరమైన స్టడీ మెటీరియల్ కోసం, హాస్టల్ ఖర్చులు, మెరుగైన శిక్షణ కోసం ఉపయోగపడేలా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా రాబోయే రోజుల్లో తెలంగాణ నుంచి సివిల్స్ లో ఎక్కువ మందికి ప్రాతినిధ్యం దక్కుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 2023లో సివిల్స్లో విజేతలుగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన వారు పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ సివిల్స్ లాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడం అభ్యర్థులకు వ్యయప్రయాసలతో కూడిన అంశమన్నారు. అలాంటి వారికి ఆర్థిక తోడ్పాటును అందించడం ద్వారా వారి ఇబ్బందులను కొంత దూరం చేయాలన్న మంచి లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సింగరేణి తరఫున దీన్ని చేపట్టడం అభినందించదగిన విషయమన్నారు. అదే సమయంలో ఈ ఏడాది సివిల్స్ లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన 40 మంది అభ్యర్థులు, ప్రస్తుతం సివిల్స్కు సన్నద్ధం అవుతున్న వారు కూడా కార్యక్రమంలో పాల్గొనడం మంచి పరిణామమన్నారు. తెలంగాణలో ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందనడానికి ఈ రోజు ప్రారంభించిన కార్యక్రమమే గొప్ప నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ తాను సివిల్స్ లో చేరిన తొలినాళ్లలో ముఖ్యమంత్రిని కలవడానికి రెండేళ్ల సమయం పట్టిందని గుర్తుచేసుకున్నారు. నేడు సివిల్స్ లో విజేతలుగా నిలిచిన తెలంగాణ బిడ్డలను అభినందించేందుకు, అలాగే సివిల్స్ రాస్తున్న యువతకు ఆర్థిక చేయూత ఇచ్చి ఆశీర్వదించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులంతా రావడం గొప్ప విషయమన్నారు. సివిల్స్ విజేతలు తమ నడవడిక తో పేదలకు ఎప్పుడూ సేవకులుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ స్వాగతోపన్యాసం చేస్తూ తాను సివిల్స్ కు ప్రిపేర్ అయ్యే సమయంలో కోచింగ్ కోసం 2 వేలు లభించక ఇబ్బంది పడ్డానని, అలాగే రూ.50 విలువ చేసే పుస్తకం కొనుగోలుకు వారం రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు.

# ప్రజల నుండి వినతులు స్వీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

● వివిధ ప్రాంతాల నుండి వచ్చి తమ బాధతుల చెప్పుకున్న సామాన్యులు
● 15 సెంట్ల స్థలాన్ని సెంటు పట్టాల జాబితాలో కలిపి పరిహారం కొట్టేశారని ఆచంట మహిళ ఆవేదన
● సంతకాల ఫోర్జరీతో రూ.30 లక్షల రుణాలు తెచ్చారన్న చిలకలూరిపేట డ్వాక్రా మహిళలు
● విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని సీఎం హామీ





**అమరావతి,జూలై 20 (వార్తాప్రభ) :** సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలు, పార్టీ కార్యకర్తలు నుండి వినతులు స్వీకరించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజలు, కార్యకర్తల నుండి నేరుగా వినతులు తీసుకుని వారి సమస్యలు విన్నారు. గత ప్రభుత్వంలో తాము ఎలా బాధితులు అయ్యిందీ వివరించారు. వైసీపీ నేతలు అక్రమంగా లాక్కున్న తమ ఆస్తులను తిరిగి తమకు అప్పగించేలా చూడాలని కోరారు. సంతకాలు ఫోర్జరీ చేసి బ్యాంకుల్లో రుణాలు తీసుకొచ్చారని యానిమేటర్లపై డ్వాక్రా సంఘాల సభ్యులు ఫిర్యాదు చేశారు. ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి సీఎం వస్తుండటంతో వికలాంగులు, వృద్ధులు వచ్చి తమ బాధలు చెప్పుకున్నారు. ఆచంట నియోజకవర్గం, వెంకటాలచెరువుకు చెందిన పిల్లి పార్వతి అనే మహిళ తన భూమిని వైసీపీలోని తమ బంధువులు ఆక్రమించారని సీఎంకు తెలిపారు. తన భూమిని తిరిగి ఇప్పించాలని కోరారు. బాధితురాలు పార్వతి తెలియజేసిన వివరాల ప్రకారం "నేను 15 ఏళ్ల క్రితం వెంకటాల చెరువులో రూ.23 లక్షల పెట్టి 15 సెంట్ల స్థలం కొన్నాను. ఉపాధి నిమిత్తం నేను కువైట్ కు వెళ్లాను. 2021లో కువైట్ నుండి వచ్చే సరికి నా స్థలానికి ఉన్న ఫెన్సింగ్ తొలగించారు. నా స్థలానికి వెనకవైపు ప్రాంతంలో గత ప్రభుత్వం సెంటు పట్టా స్థలాలు ఇచ్చింది. ఆ స్థలాలకు దారి లేదు. దాని కోసం నా 15 సెంట్ల స్థలాన్ని వైసీపీలో ఉన్న మా బంధువులు అధికార అండతో లాగేసుకున్నారు. నేను చనిపోయినట్లు చెప్పి నా సోదరి కుమారుడు గుబ్బ శ్రీనివాస్ పేరుపై తప్పుడు పత్రాలు సృష్టించారు. నేను ప్రశ్నిస్తే గుబ్బల శ్రీనివాస్, సతీష్, నాగేశ్వరరావు, వరలక్ష్మీతో పాటు మరికొంత మంది కలిసి దాడి చేసి గాయపరిచారు. పోలీసులకు చెప్పినా నాడు పట్టించుకోలేదు. దారికోసం కొంత స్థలం పోగా మిగిలిన 5 సెంట్ల స్థలాన్ని సెంటు పట్టాలలో కలిపారు. ఈ 15 సెంట్లకు గాను ప్రభుత్వం నుండి పరిహారాన్ని వారు పొందారు. స్థలం కోసం నేను పోరాటం చేస్తుండటంతో రూ.60 లక్షలు చెల్లిస్తే తిరిగి స్థలం అప్పగిస్తామని అంటున్నారు. నా స్థలం కొట్టేసిందే కాకుండా నాపైనే కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. కోర్టు కేసుల వల్ల ఉపాధి కోసం కువైట్ కూడా వెళ్లలేకపోతున్నాను. నా స్థలాన్ని తిరిగి నాకు ఇప్పించండి" అని పిల్లి పార్వతి ముఖ్యమంత్రి వద్ద విలపించారు. సావధానంగా సమస్యను విన్న చంద్రబాబు తిరిగి స్థలం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. చిలకలూరిపేట నియోజక వర్గం, తిమ్మాపురంనకు చెందిన అనీలా డ్వాక్రా సంఘ సభ్యులు సీఎంను కలిశారు. గ్రూపు సభ్యుల అనుమతి లేకుండా యానిమేటర్లు తమ సంతకాలు ఫోర్జరీలు చేశారని, తద్వారా యూనియన్, గోదావరి బ్యాంక్ లో రూ.30 లక్షల రుణాలు తీసుకున్నారని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. తాము పోలీసులను ఆశ్రయించగా 5 నెలల్లో సొమ్ము తిరిగి ఇస్తామని అంగీకారం పత్రం రాసిచ్చినప్పటికీ నేటికీ ఆ సొమ్ము చెల్లించలేదన్నారు. పైగా పోలీసులతో కుమ్మక్కై బెదిరిస్తున్నారన్నారు. రుణం సొమ్ము చెల్లించాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై విచారణ చేయించి, నిందితులపై చర్యలు తీసుకుని సొమ్మును రికవరీ చేయిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# సింగపూర్ యూనివర్సిటీలో మాస్టర్స్ పట్టా పొందిన అనా కొణిదెల



**అమరావతి,జూలై 20 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సతీమణి అనా కొణిదెల సింగపూర్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. అనా కి ఇది రెండో మాస్టర్స్ డిగ్రీ. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ లో వైభవంగా నిర్వహించిన స్నాతకోత్సవంలో పట్టా స్వీకరించారు. ఆగ్నేయాసియా దేశాల కళలు, సామాజిక విజ్ఞానం (ఆర్ట్స్, సోషల్ సైన్సెస్) లో ఆమె ఈ మాస్టర్స్ చేశారు. మాస్టర్స్ పట్టా పొందినందుకు సతీమణికి పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు. అనా కొణిదెల రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్శిటీలో చదివారు. అక్కడ ఓరియంటల్ స్టడీస్ లో హానర్స్ పట్టా పొందారు. ఆసియా దేశాల చరిత్ర, భాషలు, జీవన విధానంపై అధ్యయనానికిగాను తొలుత డిగ్రీ పొందారు. ఆ అధ్యయనంలో థాయిలాండ్ చరిత్ర ఒక ప్రత్యేక సబ్జెక్ట్ గా ఉంది. సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్శిటీలో ఉండగానే మూడు భాషలు కూడా నేర్చుకున్నారు. ఆ తర్వాత బ్యాంకాక్‌లోని చులాలాంగ్‌కార్న్ యూనివర్సిటీ నుంచి థాయ్ స్టడీస్‌లో అనా మొదటి మాస్టర్స్ డిగ్రీ సాధించారు.

# ఢిల్లీలో నిరసన తెలుపుదాం..

● చంద్రబాబు ప్రభుత్వ దారుణాలను దేశ ప్రజలకు తెలుపుదాం ● వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి..



**తాడేపల్లి,జూలై 20 (వార్తాప్రభ) :** వైసీపీ ఎంపీలతో పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశం ముగిసింది. దాదాపు 40 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై ఎంపీ లకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ, శాంతి భద్రతల విషయంలో టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని చెప్పారు. వినుకొండలో జరిగిన హత్యను చూస్తే.. ఏపీ రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థమవుతుందని అన్నారు. వైసీపీ నేతలు, కార్యకర్తలకు ఒక మెసేజ్ పంపడానికి చేసిన ప్రయత్నం ఈ హత్య అని చెప్పారు. తన సొంత పార్లమెంట్ నియోజక వర్గం, తన తండ్రి పెద్దిరెడ్డి శాసన సభ నియోజక వర్గంలో ఎంపీ మిథున్ రెడ్డిపై దాడులు చేశారని జగన్ తెలిపారు. పోలీసులతో ముందే ప్లాన్ చేసి దాడులు చేశారని చెప్పారు. ఏపీలో రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేయాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో నిరసన తెలుపుతామని చెప్పారు. మంగళవారం నాటికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు ఢిల్లీకి వస్తారని.. బుధవారం ఢిల్లీలో నిరసన తెలుపుదామని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలను దేశ ప్రజలకు వివరిద్దామని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వ దారుణాలను పార్లమెంటు, దేశ ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఢిల్లీలో ధర్నా, నిరసన కార్యక్రమాలకు సంబంధించి ఒక్కో ఎంపీకి ఒక్కో బాధ్యత అప్పగించాలని ఆదేశించారు. ఎంపీ లంతా వెంటనే ఢిల్లీకి వెళ్లే పనిలో ఉండాలని చెప్పారు..

# హైదరాబాద్ ను విశ్వ నగరంగా అభివృద్ధి చేసుకోవటమే మన ముందున్న లక్ష్యం

● గోపన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







**శేరిలింగంపల్లి,జూలై 20 (వార్తాప్రభ) :** హైదరాబాద్ ను విశ్వ నగరంగా అభివృద్ధి చేసుకోవటమే మన ముందు ఉన్న ముఖ్య లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గోపాన్ పల్లి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ శేరిలింగంపల్లిని వేగంగా అభివృద్ధి చేసే బాధ్యత కూడా ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. హైదరాబాద్ నగరంలో సమస్యల పరిష్కారానికి, విపత్తుల నిర్వహణకు హైడ్రా అనే నూతన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నా మన్నారు. లండన్ థెమ్స్ నదిలా మూసీ సుందరీకరిస్తామని, మూసీ రివర్ డెవలప్మెంట్ కు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. త్వరలోనే ప్రణాళికలు సిద్ధం చేసి లక్షా 50వేల కోట్లతో పనులను ప్రారంభించుకోబోతున్నమని, హైదరాబాద్ ను విశ్వనగరంగా అభివృద్ధి చేసుకోవడమే మన ముందు న్న లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రస్తుతం మూసీ అంటే ముక్కు మూసుకునే పరిస్థితి ఉందని,రాబోయే ఐదేళ్లలో ప్రపంచ పర్యాటకులు సందర్శించేలా మూసీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసామన్నారు. మూసీ అభివృద్ధి చూడగానే ప్రజా ప్రభుత్వం గుర్తొచ్చేలా తీర్చిదిద్దుతామన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో మీరంతా భాగస్వాములు కావాలని ప్రజలను కోరారు. వచ్చే పదేళ్లలో హైదరాబాద్ ను విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి మీ అందరి సహకారం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,రెవెన్యూ,విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి,శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ,శాసనమండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి,డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి,స్పెషల్ సెక్రటరీ ఆర్ అండ్ బి దాసరి హరిచందన,రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్,శేరిలింగంపల్లి కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్,ఉప్పలపాటి శ్రీకాంత్,హమీద్ పటేల్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి "వార్తా ప్రభ"తో మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికి,అధికారులకు శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గోపన్ పల్లి తండా చౌరస్తా వద్ద వై ఆకారం లో ఫ్లై ఓవర్ ను నిర్మించడం జరిగినదని,గౌలిదొడ్డి నుండి వన్ వే ట్రాఫిక్ తరహాలో గౌలి దొడ్డి నుండి నల్లగండ్ల వైపు 430 మీటర్లు పొడవు మరియు గౌలిదొడ్డి నుండి తెల్లాపూర్ వైపు550 మీటర్ల పొడవు గల మొత్తం 16 నెంబర్స్ స్పాన్స్ తో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టడం జరిగినదన్నారు. ఎన్నో ఏండ్ల సమస్యకు నేటితో తీరునని,ట్రాఫిక్ రహిత సమాజం కోసం అద్భుతమైన ఫ్లై ఓవర్ ను నిర్మించుకోవడం జరిగినదని,వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటం వలన ట్రాఫిక్ ఇబ్బంది కలుగునని, ప్రజలకు ట్రాఫిక్ రహిత ,ఫ్రీ సిగ్నల్ కోసం ఫ్లై ఓవర్ చేపట్టడం జరిగిందన్నారు. గచ్చిబౌలి డివిజన్ లో ఐటీ రంగం,అతి పెద్ద భవనాలు,అత్యధిక ప్రజానీకం నివాసితున్న ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమైన పరిస్థితుల్లో అదేవిధంగా ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తిరునని, ప్రజల సౌకర్యార్థం,ప్రజావసరాల దృష్ట్యా ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టడం జరిగినదని, అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని గంగాధర్ రెడ్డి చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా,సీనియర్ నాయకులు,డివిజన్ నాయకులు,మహిళ నాయకులు,మహిళ కార్యకర్తలు,అభిమానులు, గోపనపల్లి తండ వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లలకు ఇబ్బంది కలిగితే క్షమించేది లేదు

● వ్యాధులు వ్యాపించకుండా మెరుగైన చర్యలు తీసుకోవాలి
● భోజనం, తాగునీరు, వసతుల విషయంలో రాజీ పడొద్దు
● బీసీ సంక్షేమ హాస్టళ్లలోని సదుపాయాలపై మంత్రి సవిత ఆదేశాలు



**విజయవాడ,జూలై 20 (వార్తాప్రభ) :** బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా బాధ్యులైన అధికారుల్ని ఉపేక్షించబోనని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత హెచ్చరించారు. వర్షాలు పడుతుండడం, వ్యాధులు వ్యాపించే అవకాశం ఉండడంతో తక్షణమే హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారుల్ని ఆదేశించారు. తాగునీరు, భోజనం, వసతుల విషయంలో రాజీ పడకుండా చూసుకోవాలన్నారు. మన ఇంట్లో పిల్లల్ని ఏ విధంగా చూసుకుంటామో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో హాస్టల్లోని పిల్లల విషయంలోనూ అదే విధమైన శ్రద్ధ చూపాలన్నారు. ఇప్పటికే హాస్టళ్లలో పరిశీలన చేయగా, చాలా చోట్ల వసతులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రధానంగా డయేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై చాలా చోట్ల ఫిర్యాదులు అందాయి. వసతుల విషయంలో రాజీ పడే అధికారులను ఉపేక్షించబోనన్నారు. అన్ని హాస్టళ్లలో కూడా విధిగా నిర్వహణ చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం కల్పించినపుడే వారు మరింత మెరుగ్గా చదువుకునే అవకాశం ఉంటుందని మంత్రి సవిత తెలిపారు.

# ఎంపి కేశినేని చిన్ని కార్యాలయానికి విచ్చేసిన కేంద్రమంత్రి



**విజయవాడ పశ్చిమ,జూలై 20 (వార్తాప్రభ) :** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు శనివారం విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయానికి విచ్చేశారు. ఉండవల్లి లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో టిడిపి పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ తో కలిసి రావటం జరిగింది. రామ్మోహన్ నాయుడు రాకతో సందడి వాతావరణం నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి వారితో ఫోటోలు దిగారు. అనంతరం కొంతమంది నేతలతో కింజరపు రామ్మోహన్ నాయుడు, ఎంపి కేశినేని శివనాథ్ స్థానిక సమస్యలపై మాట్లాడటం జరిగింది.

## వార్తాప్రభ - పంచాంగం

**21-7-2024 ఆదివారం**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం. ఆషాఢమాసం, శుక్లపక్షం

తిథి : పూర్ణిమ ప.3.47 వరకు

నక్షత్రం : ఉత్తరాషాఢ రా.12.14 వరకు

వర్జ్యం : ప.9.18 నుండి 10.37 వరకు రా.3.55-5.23 వరకు

దుర్ముహూర్తం : సా.4.54 - 5.46 వరకు

రాహుకాలం : సా. 5.01 - 6.38 వరకు

మంచి సమయం : ప. 10.45 నుండి 11.45 వరకు

సూర్యోదయం : 5.41కి

సూర్యాస్తమయం : 6.38కి



వార్తాప్రభ
తెలుగు దినపత్రిక
రోజుకు రూ.300/- మాత్రమే
మినిమం 1X6 నెలకు : రూ.1999/-
జూలై 1 నుంచి శుభారంభం
క్లాసిఫైడ్స్
మరిన్ని వివరాలకు :
9347993188, 9666568661
● అమ్మకం
● అద్దెకు
● కంప్యూటర్
● ఫర్నీచర్స్
● స్థలం
● ఆటోమొబైల్స్
● కావలెను
● సర్వీసు


## వార్తాప్రభ - రాశిఫలాలు




12 రాశుల వారు ఎలాంటి పరిహారాలు పాటించాలనే ఆసక్తికరమైన విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం...

**మేష రాశి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు అనేక శుభ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది. సమాజంలో మీ కీర్తి, ప్రతిష్టలు పెరుగుతాయి. మీ జీవిత భాగస్వామి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి. బయటి ఆహారం తినడం మానుకోవాలి.

**వృషభ రాశి వారి ఫలితాలు ..** ఈ రాశి వారిలో వ్యాపారులు మంచి లాభాలను పొందే అవకాశం ఉంటుంది. ఈరోజు, మీ పదవీకాలంలో మీకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. మీ సహోద్యోగులు కూడా దీనికి సహకరిస్తారు.

**మిధున రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు చాలా రంగాల్లో శుభ ఫలితాలను పొందుతారు. ఉద్యోగులు ఈరోజు వారికి ఇష్టమైన పనిని చేసుకుంటారు. ఈ సాయంత్రం నాటికి మీకు కొన్ని ప్రత్యేక పని బాధ్యతలు అప్పగించబడొచ్చు.

**కర్కాటక రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు పూర్తి అంకితభావంతో ఉంటారు. మీరు ఏ పని చేసినా, దాని ఫలితాలు సరైన సమయంలో మీకు లభిస్తాయి. మీ అసంపూర్ణమైన పని సకాలంలో పూర్తవుతుంది.

**సింహ రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు చాలా బిజీగా ఉంటారు. మీ ప్రేమ జీవితానికి మీరు ఇంకా సమయాన్ని వెతుక్కోగలుగుతారు.

**కన్య రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారిలో ఉద్యోగులకు, వ్యాపారులకు మంచి గౌరవం లభిస్తుంది. దీనివల్ల మీ ఆదాయం కూడా పెరుగుతుంది. ఈరోజు కుటుంబంలో కొన్ని శుభకార్యాల గురించి చర్చలు జరిగే అవకాశం ఉంది.

**తులా రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు ఆర్థిక పరంగా మంచి ప్రయోజనాలు పొందనున్నారు. శని అనుగ్రహంతో వీరు అన్ని రంగాల్లో విజయం సాధించగలరు. మీ ఆదాయం క్రమం పెరుగుతుంది. విద్యార్థులు పరీక్షల్లో మంచి విజయం సాధించగలరు.

**వృశ్చిక రాశి ఫలితాలు..** ఈ రాశి వారిలో వ్యాపారులు తమ వ్యాపారంలో ఈరోజు కొత్త ప్లాన్ అమలు చేయొచ్చు. సమయం ఈరోజు అనుకూలంగా ఉంటుంది. ఈ రోజంతా లాభదాయకమైన అవకాశాలు వస్తూనే ఉంటాయి.

**ధనస్సు రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు కుటుంబ జీవితానికి సంబంధించి కొంత డబ్బు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఈరోజు మీరు వ్యాపారంలో సువర్ణావకాశాన్ని పొందుతారు. మీరు వ్యాపారంలో కొంచెం రిస్క్ తీసుకుంటే, భారీ లాభం వచ్చే అవకాశం ఉంది.

**మకర రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు చాలా మంచిగా ఉంటుంది. మీరు ఏకాగ్రతతో పనిని పూర్తి చేసి సకాలంలో మంచి ఫలితాలను పొందుతారు. పెండింగులో ఉన్న పనులను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తారు. ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గుతుంది.

**కుంభ రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే వాతావరణంలో మార్పులు మీ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. మీ ఆహారపు అలవాట్లలో అజాగ్రత్తగా ఉండకండి.

**మీన రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారిలో వ్యాపారులకు మంచి లాభాలు వచ్చే అవకాశం వస్తుంది. ఈరోజు మీరు ఏదైనా రిస్క్ తీసుకునేందుకు సమయం అనుకూలంగా ఉంటుంది. మీ మాటతీరులో మార్పులు తీసుకురావాలి.


పోతిన కుమార్
సెల్ : 6300148993
9014094388
విజయ మిల్క్ పార్లర్
కుమార్ మిల్క్
చిన్నకోటవారి చౌక్, విజయవాడ-1


మా వద్ద విజయవారి పాలు, పాల పదార్థములు ఆర్డరుపై సప్లయి చేయబడును.
డోర్ డెలివరీ సౌకర్యము కూడా కలదు





Satish : 8019483304 - Ranga : 9247284050
దివ్యసాయి ఎలక్ట్రికల్స్
DIVYASAI ELECTRICALS
WHOLESALE & RETAIL ELECTRICAL GOODS
Opp. Steel Palce,
Samarangam Chowk, Main
Road, Vijayawada - 520 001
VIHAN GM legrand FINECAB


## శ్రీ బాలత్రిపుర సుందరి అమ్మవారిని శాఖాంబరి అలంకారంలో దర్శించండి : కార్యనిర్వహణాధికారి



**కాకినాడ,జూలై 20 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా కాకినాడ స్థానిక శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఆషాడ మాస పౌర్ణమి పర్వదిన మును పురస్కరించుకుని ఆదివారం అమ్మ వారు శ్రీ శాఖంబరి అవతారంలో భక్తుల కు దర్శనమిస్తారని కార్యనిర్వహణాధికారి సిహెచ్ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు.ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఆయన పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య అతిథిగా సిటి ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) హాజరౌ తున్నారని జూలై 21 ఆదివారం శ్రీ అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించబడునన్నారు. శ్రీ అమ్మవారిని ఐదు టన్నుల వివిధ రకములైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లుతో పూర్తిగా అలంకరించడం జరుగుతుందన్నారు. శ్రీ అమ్మవారి శాఖాంబరి అలంకారమునకు అవసరమగు కూరగాయలు (అన్నిరకాలు) ఆకుకూరలు (అన్నిరకాలు), పండ్లు(అన్నిరకాలు) వస్తురూపంలో ఆలయం వద్ద దాతలు అందించవచ్చునని సూచించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

## నాడు రంగస్థల రారాణి -నేడు భిక్షాటన దీని స్థితిలో మురమళ్ల సుబ్బలక్ష్మి

● ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తామన్న రంగస్థల కళాకారులు



**కాకినాడ,జూలై 20 (వార్తాప్రభ) :** కాకినాడ రంగస్థల కళా కారిణి మురమళ్ల సుబ్బలక్ష్మి అనేక సాంఘీక నాటకాలలో,పరిషత్ నాటకాలలో నటించి మెప్పించిన నటీమణి.నటుడు, దర్శకుడు స్వర్గీయ పంతం సత్యనాధన్ బృందంలో కూడా పనిచేసివున్నారు. అయినవాళ్ళు దూరం కావడం,చేతికి అందివచ్చిన కొడుకు బలవన్మరణం (సూసైడ్) చేసుకోవడం ఆమె మనస్సు ప్రశాంతతను కోల్పోయి పిచ్చి చేష్టలతో ఊరూరా తిరగడం,నేడు పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవాలయం ముంగిట భిక్షాటన చేస్తూ దర్శనమిచ్చిన కళామతల్లి ముద్దుబిడ్డని చూసిన పిఠాపురం కళాకారిణి ఎలిశెట్టి భానుమతి, ఆమెను చూడగానే కళ్ళల్లో కన్నీళ్లు ఉబికి వచ్చాయని మాకు ఈ విషయాన్ని మాకు తెలియజేయడంతో పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్,మాజీ ఎమ్మెల్యే జనసేన,టిడిపి, భాజపా కూటమిలో కీలక పాత్ర వహించిన వర్మ ,రంగస్థల కళాకారిణికి వృద్ధాప్య పింఛను,జాగా ఇప్పించి చేయూత నీయవలసినదిగా విజ్ఞప్తి చేస్తూ.విజ్ఞాపన పత్రాన్నికూడా అందజేస్తామని, రంగస్థల,సినీ నటులు బాజిబోయిన వెంకటేష్ నాయుడు మీడియా కు తెలిపారు.

## విద్యతోనే ఉన్నత శిఖరాలు: ఎమ్మెల్యే పంతం నానాజీ





**కాకినాడ రూరల్/కరప,జూలై 20 (వార్తాప్రభ) :** విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు. శనివారం కరప గ్రామంలో చిరంజీవి కళ్యాణ మండపంలో ఎంఈవో కృష్ణ వేణి, సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం అందించే స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నానాజీ పాల్గొని కరప మండల పరిధిలోని 67 పాఠశాలల కు గాను 5102 విద్యార్థులకు రూ. 1,23,41,738 లక్షలు విలువ చేసే స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సంద ర్భంగా ఆయన విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ కలిగి విద్యనభ్యసిస్తే భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని అన్నారు.శ్రద్ధాశక్తులతో విద్యను అభ్యసించాలని నానాజీ సూచించారు. అకాల వర్షాలకు గాను పాఠశాలకు సెలవు ప్రకటించినప్పటికీ స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి హాజరైన విద్యార్థిని,విద్యార్థులకు అభినందలు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా రానున్న రోజుల్లో తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు, ప్రభుత్వ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ఉపాధ్యాయులు రాష్ట్ర, జిల్లా, మండల,గ్రామ పార్టీ కూటమి నాయకులు జన సైనికులు,వీర మహిళలు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ చదరంగ దినోత్సవం



**కాకినాడ,జూలై 20 (వార్తాప్రభ) :** ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ చదరంగ దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా.బి ఈ వి ఎల్ .నాయుడు తెలిపారు. జూలై 20వ తేదీని అంతర్జాతీయ చదరంగం దినోత్సవంగా జరుపుకోవాలనే ఆలోచన యునెస్కోచే ప్రతిపాదించబడింది. ప్రపంచవ్యాప్తంగా చెస్ ఈవెంట్‌లు, పోటీలను నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో మహిళా భాగంలో ఎం.నిర్మల,బి.నిత్య సంతోషి, పురుషుల విభాగంలో డి.దివాకర్ ఎన్ సద్గురు స్వామి వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య నిపుణులు,రాష్ట్ర ఐడిఎ సిధిహెచ్ కన్వీనర్,చదరంగ క్రీడాకారులైన డా.అడ్డాల సత్యనారాయణ విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఒక భాగం కావాలని,చదరంగం మానసిక సామర్థ్యాన్ని పెంచే ఆట అని విద్యార్థులు ఆటలలో రాణించాలని అన్నారు. విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డా.నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు ఆటలకు ప్రత్యేక ప్రాధాన్యం చేయడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డా.నల్లమిల్లి శేషారెడ్డి,డిగ్రీ కళాశాలల కార్యదర్శి డా.నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు,దివాకర్ రావు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ అన్నపూర్ణా దేవి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న వితరణ



**కాకినాడ,జూలై 20 (వార్తాప్రభ) :** హరీష్ స్పోర్ట్స్ వద్ద డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న వితరణ చేశారు. ప్రతి శనివారం ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ఈవిందులో నాలుగు రకాల స్వీట్లు, పులి హోర,వివిధ రకాల కూరలు,సాంబారు, పెరుగుతో అన్నదానం నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలందరూ హాజరై అన్నప్రసాదాలు స్వీకరించారు. డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవ సంఘం చైర్మన్ తలాటం హరీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రతి శనివారం కాకినాడ నగర వాసులకు మంచి భోజనం అందించేందుకు సేవా సంఘం సిద్ధంగా ఉన్నామని హరీష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజికవేత్త కస్తూరి పట్టాభి రామయ్య, కరప తాతీయులు, సంఘ సేవకురాలు,చార్లీ, అనసూయ రాజకుమారి పిడకా శేషు,హరీష్ స్పోర్ట్స్ శ్రీను, మణికంఠ, కృష్ణవేణి, అన్న ప్రసాదాన్ని దగ్గర ఉండి వడ్డించారు.. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన సేవా సంఘం సభ్యులకు భోజనాన్ని స్వీకరించిన నగరవాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ అన్నదాన కార్యక్రమానికి సహాయ సహకారాలు కోటయ్య స్వీట్స్ అధినేత చిట్టి పెద్ది రామ కుమార్, కర్నూలు చెందిన కొణిదెల గాయత్రి,పినిశెట్టి సురేష్,పట్టాభి రామయ్య అందించారు..

## ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

● వర్షపు నీరు నిల్వలేకుండా చర్యలు ● కమిషనర్ జే.వెంకటరావు

● పలు ప్రాంతాలలో పర్యటన



**కాకినాడ,జూలై 20 (వార్తాప్రభ) :** వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కాకినాడ నగరపా లక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు సూ చించారు.వర్షాల నేపథ్యంలో శనివారం ఆయన కొత్తపేట మార్కెట్,ఫౌండేషన్ హాస్పిటల్ రోడ్డు, ఎన్ ఎఫ్ సి ఎల్ రోడ్డు ప్రాంతాలలో పర్యటించారు. వర్షపు నీరు నిలువ లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. డ్రైనేజీలను పరిశీలించారు. వర్షాల కారణంగా డ్రైనేజీలలో నీరు స్తంభించిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. బొందగుంట లోని వెహికల్ యార్డు ప్రాంతాన్ని కూడా కమిషనర్ సందర్శించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షపు నీరు నిలిచిపోకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా ముంపు సమస్య ఉంటే సత్వరమే పరిష్కరించేలా ఆదేశాలు ఇచ్చినట్లు కమిషనర్ తెలిపారు.ఇంకా ఒకటి రెండు రోజులపాటు వర్షాల ప్రభావం ఉండే అవకాశం ఉందని, ప్రజలు కూడా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కాచి చల్లార్చిన నీరు త్రాగడం, వేడిగా ఉండే ఆహారాన్ని భుజించడం, పరిసరాల పరిశుభ్రత, బయట నుంచి మాంసాహారాన్ని తీసుకోకుండా దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే డయేరియా వంటి సమస్యల బారిన పడకుండా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంహెచ్ఓ డా.పృధ్విచరణ్, శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ లాజర్ తదితరులున్నారు.

## డా.బి.ఈ.వి.ఎల్ .నాయుడుకు ఉత్తమ సేవా పురస్కారం



**కాకినాడ,జూలై 20 (వార్తాప్రభ) :** ఆదిత్య డిగ్రీ,పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా.బిఈవిఎల్ .నాయుడు గౌరవప్రదమైన ఇండియన్ రెడ్‌క్రాస్ అవార్డును కాకినాడ జిల్లా కలెక్టరు, జిల్లా మేజిస్ట్రేట్ సగిలి షాన్ మోహన్ చేతుల మీదుగా అందుకున్నారని ఆదిత్య డిగ్రీ కళాశాలల సెక్రటరీ , రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ డా.నల్లమిల్లి సుగుణా రెడ్డి తెలిపారు.కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశం కలెక్టరేట్ మీటింగ్ హాల్లో రెడ్ క్రాస్ చైర్మన్ వై డి రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉత్తమ సేవలు అందించిన యూత్ రెడ్ క్రాస్ జూనియర్ రెడ్ క్రాస్ విభాగాలకు ఉత్తమ సేవా పురస్కారాలు అందించారు. ఈ పురస్కారాలలో ఆదిత్య డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ విభాగం ఉత్తమ సేవలను అందించడంలో ప్రథమ స్థానంలో నిలిచింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకినాడ జిల్లా కలెక్టరు జిల్లా మేజిస్ట్రేట్ సగిలి షాన్ మోహన్ చేతుల మీదుగా ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా.బి ఈ వి ఎల్ .నాయుడు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు.కళాశాలలో పలు రక్తదాన శిబిరాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలతోపాటు రెడ్‌క్రాస్ సొసైటీలో వంద శాతం సభ్యత్వ నమోదు చేసినందుకుగానూ ఈ అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ కాకినాడ లోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డిగ్రీ కళాశాలల్లో యూత్ రెడ్‌క్రాస్ వింగ్స్ ద్వారా రక్తదానం, ప్రథమ చికిత్స, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మెళుకువలు వంటి అనేక సామాజిక కార్యకలాపాలను విద్యార్థులకు తెలియజేస్తూ, వారిని సామాజిక బాధ్యత గల వ్యక్తులుగా మార్చేలా చేసిందని అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలలో విద్యతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. పురస్కారానికి ఎంపిక చేసిన ఐఆర్సీఎస్ చైర్మన్ వై డి రామారావు కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డా.నాయుడును ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా.నల్లమిల్లి శేషారెడ్డి,కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐ ఆర్ సి ఎస్ నోడల్ ఆఫీసర్ తేజేశ్వరరావు, శాఖాధిపతులు,అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు అభినందించారు.

## నేటి నుండి శుద్ధ జలాలు...






**నూజివీడు,జూలై 20 (వార్తాప్రభ) :** నేటినుండి నూజివీడు నగర వాసులకు సురక్షితమైన శుభ్రపరిసిన కృష్ణా నది త్రాగునీరు అందిజేస్తున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి తెలిపారు. గత 3 సంవత్సరాల నుండి కృష్ణానది త్రాగునీటి స్టోరేజ్ ట్యాంక్ మరియు శుద్ధి యంత్రాలను శుభ్రం చేయకుండా గత పాలకులు అలా గాలికి వదిలేసి అశుభ్రమైన నీటిని నగర ప్రజలకు అందిస్తున్నారని తద్వారా ప్రజలకు మురిగి నీరు కలుషితమైన నీరు త్రాగడంతో జ్వరాలు, దగ్గు, మరియు పలు రకాల జబ్బుల బారిన పడి ఎంతో ఇబ్బంది పడుతున్నామని ఈ మురికి నీటిని త్రాగ లేకపోతున్నామని మంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజలు సమస్యను విన్న మంత్రివర్యులు తక్షణమే మున్సిపల్ అధికారులను పిలిపించి తక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు శుద్ధి చేసిన తరువాతే త్రాగునీటిని ప్రజలకు వదలాలని మున్సిపల్ కమీషనర్ కి హెచ్చరించారు మంత్రివర్యులు హెచ్చరించిన 24 గంటల్లో శుభ్రం చేసిన స్వచ్ఛమైన నీరు అందడంతో నగర ప్రజలు తమ హర్షాన్ని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు ఇక నుండి మాకు ఎటువంటి రోగాలు రాకుండా ఆరోగ్యకరమైన జీవనం కొనసాగిస్తూ సంతోషంగా జీవితాన్ని గడుపుతామని తెలియజేస్తున్న నగర ప్రజలు అడిగిన వెంటనే శుభ్రమైన మంచి నీరుని అందించిన మంత్రివర్యులకు జీవితాంతం రుణపడి ఉంటామని తమ ఆనందాన్ని నూజివీడు పట్టణ ప్రజలు వ్యక్తం చేశారు.

## కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ఇస్లాంపేట వాసులు





**గన్నవరం,జూలై 20 (వార్తాప్రభ) :** గన్నవరం పోలీస్ స్టేషన్ వెనుక ఇస్లాం పేటలో డ్రైనేజీలు పుడుకుపోయి డ్రైనేజీల్లో వర్షపు నీరు వెళ్లకుండా రోడ్డు పైనే వర్షపు నీరు నిలిచిపోయారు. రెండు రోజులుగా వర్షం నీరు డ్రైనేజీ వాటర్ కలిసిపోవడంతో దోమలతో ఇబ్బంది పడుతున్న, ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీలు కూడుకుపోయిన ఏ ఒక్క పంచాయతీ అధికారి గాని ఎవరు పట్టించుకోవట్లేదని, డ్రైనేజీ పుడికలు తీపించి దోమల బారి నుండి వ్యాధులు భారీ నుండి కాపాడాలని ఇస్లాంపేట వాసులు విజ్ఞప్తి చేశారు.

## సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**చల్లపల్లి/అవనిగడ్డ,జూలై 20 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని చల్లపల్లి తహసీల్దార్ బీ.సుమతి శనివారం ఒక ప్రకటనలో కోరారు. చల్లపల్లి రైతు బజారులో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఇప్పటి వరకు 113 మంది 1,245 కేజీలు రా రైస్, 34 మంది 385 కేజీల స్టీమ్ రైస్, 173 మంది 146 కిలోల కందిపప్పు కొనుగోలు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని రిలయన్స్ స్మార్ట్ బజారులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా 24 మంది 50 కిలోల రా రైస్, 46 మంది 74కిలోల స్టీమ్ రైస్, 72 మంది 84 కేజీల కందిపప్పు కొనుగోలు చేసినట్లు వివరించారు. ఈ కేంద్రాల్లో బీపీటీ, స్వర్ణ మసూరి రా రైస్ కేజీ రూ.48, స్టీమ్ రైస్ కేజీ రూ.49, దేశవాళి కందిపప్పు కేజీ రూ.160లకు అందిస్తున్నట్లు వివరించారు.

# "బడిబాట" బంగారు భవిష్యత్తుకు పునాది!!

- బుడిబుడి అడుగులు వేసే బాలలకు అక్షరాభ్యాసం
- రజిత, 38వ డివిజన్ అంగన్వాడి టీచర్



**పెద్దపల్లి/ గోదావరిఖని: జూలై 20 (వార్తాప్రభ ప్రతినిధి)**బుడిబుడి అడుగులు వేసే బాలలకు "బడిబాట" బంగారు భవిష్యత్తుకు పునాది అని అన్నారు రామగుండం నగరపాలక సంస్థ 38వ డివిజన్ అంగన్వాడీ టీచర్ రజిత. ఈ మేరకు శనివారం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ మాట్లాడుతూ...... చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడి కేంద్రాల ద్వారా అడుగులు వేస్తున్నాయి అని అన్నారు. చిన్నారుల భవితకు బాట వేసే విధంగా అంగన్వాడీ కేంద్రాలలో విద్యా బోధనతో పాటు పౌష్టిక ఆహారమైన పాలు, గుడ్లు, బాలామృతం, మధ్యాహ్నా భోజనం, చిరుతిళ్ళు ఉచితంగా పంపిణీ చేయడం సంతోషకరమైన విషయమని తెలిపారు.

# మాజీ మంత్రి కేటీఆర్ ను కలిసిన బిఆర్ఎస్ నేత రవీందర్ యాదవ్



**శేరిలింగంపల్లి,జూలై 20 (వార్తాప్రభ)**: శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ లో గల ఓ ప్రవేట్ హాస్పిటల్ కు మాజీమంత్రి,బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ రెసిడెంట్ కేటీఆర్ శనివారం విచ్చేశారు. ఈ విషయం తెలుసుకున్న తెరాస రాష్ట్ర నాయకులు రవీందర్ యాదవ్ కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత పరిస్థితి గురించి రవీందర్ యాదవ్ కేటీఆర్ కు వివరించారు.

# ఆర్టీసీ ఆస్పత్రిలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హైదరాబాద్ తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన సిటీ స్కాన్, ఎంఆర్ఐ ఆధునిక వైద్య పరీక్షా కేంద్రాలతో పాటు ఫిజియోథెరఫీ యూనిట్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, ఫార్మసీని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. చికిత్స కోసం వచ్చిన ఆర్టీసీ సిబ్బందితో ఆయన ముచ్చటించారు. ఈ కార్యక్రమాల్లో టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తార్నక ఆర్టీసీ ఆస్పత్రిలో వైద్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. సిబ్బందికి అందిస్తోన్న వైద్య సేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అంతకముందు ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కను నాటారు.

# శ్రీ.ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్లో హరితహార కార్యక్రమం

**కుత్బుల్లాపూర్ జూలై 20 (వార్తాప్రభ)**: విద్యార్థులలో హరితహారం పై అవగాహన పెంచేందుకు శ్రీ.ఎస్.పి.ఆర్ గ్లోబల్ హైస్కూల్లో శనివారం హరితహారం ప్రోగ్రాం ని నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించినటువంటి హరితహార కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... ఇంతటి గొప్ప మహత్కర కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతగానో సంతోషాన్ని కలిగించిందని ఇదే విధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని తెలిపారు. అనంతరం శ్రీ .ఎస్ .పి .ఆర్ గ్లోబల్ హై స్కూల్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి మాట్లాడుతూ...ఈ కార్యక్రమంలో కూన శ్రీశైలం గౌడ్ పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఇదేవిధంగా ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు నాడు ఒక మొక్కను నాటి మన పర్యావరణాన్ని కాలుష్యము నుండి కాపాడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రషీద్ బేగ్ , లాల్ మహమ్మద్, శ్రీ .ఎస్.పి .ఆర్ గ్లోబల్ స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.



# మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలి

## కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన అఖిల పక్షం నాయకులు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం మున్సిపాలిటీ లో జరుగుతున్న అవినీతి,అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని,ఇటీవల నిర్వహించిన, వేసిన అన్ని రకాల టెండర్లను తక్షణమే రద్దు చేసి,మరల టెండర్ ప్రక్రియ నిర్వహించాలని అఖిల పక్ష నాయకులు శనివారం కలెక్టర్ జితేష్.వి.పాటిల్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ రాష్ట్ర కన్వీనర్ జేబీ శౌరి,బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్,సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ లు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన టెండర్ ప్రక్రియ లో కనీస నిభందనలు పాటించ లేదని తద్వారా మున్సిపాలిటీకి లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ఆరోపించారు.మాంసం వ్యర్థాలను రవాణా చేసుకొనుటకు పాల్వంచ మున్సిపాలిటీలో టెండర్ నిర్వహించగా తొమ్మిది నెలలకు రూ.23,05000 ఇరవై మూడు లక్షల ఐదు వేల రూపాయలకు వేలంలో ధక్కించుకున్నారని కొత్తగూడెం మున్సిపాలిటీలో అందుకు భిన్నంగా ఏవిధమైన టెండర్ నిర్వహించకుండా గతంలో టెండర్ నిర్వహిస్తున్న వ్యక్తికి కేవలం రూ.2 లక్షలకు టెండర్ కాలాన్ని సంవత్సరం పొడగించడం మూలంగా ఇరవై లక్షల రూపాయలకు పైగా ఆదాయనికి గండి పడేలా చేశారని ధ్వజమెత్తారు.మున్సిపాలిటీలో నలుగురు వ్యక్తులు సిండికేట్ అయ్యి ఏ నాయకుడు గెలిచినా అతని పంచన చేరి మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కిన్నెరసాని మంచినీటి కోసం పనులు ప్రారంభం జరిగే వరకు రహదారులు,కాలువలు నిర్మాణం నిలుపుదల చేయాలని కోరారు.ఒకవైపు కిన్నెరసాని మంచినీటి పనులంటూ హడావుడీ చేస్తూ ఇంకోవైపు రోడ్డు నిర్మాణాలు జరిగితే వేసిన రోడ్లను మళ్ళీ తవ్వి పైపు లైన్ వేయడం వల్ల లక్షల రూపాయలు దుర్వినియం అయ్యే అవకాశం ఉందన్నారు.మున్సిపాలిటీలో జరుగుతున్న అనేక అవకతవకలను సమగ్రంగా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని వారు అన్నారు.మున్సిపాలిటీ పనితీరుపై సమీక్ష జరపాలని అక్కడ జరుగుతున్న అవినీతి అక్రమాలకు సహకరిస్తున్న అధికారుల పైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.సమస్యలపై సానుకూలంగా స్పందించి టెండర్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన కలెక్టర్ కు అఖిల పక్షం నాయకులు ధన్యవాదాలు తెలిపారు.మున్సిపాలిటీ సమస్యల పరిష్కారం కోసం,అదేవిధంగా జరుగుతున్న అవినీతి,అక్రమాలపై దశల వారి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని,సిండికేట్ రాజకీయాలను ప్రజలకు వివరిస్తామని,అవినీతికి పాల్పడుతున్న వారికి భవిష్యత్తులో ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జున రావు,ఆదివాసీ ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర,సిపిఎం పట్టణ నాయకులు వీరన్న,వార్డు కౌన్సిలర్ తంగెళ్ల లక్ష్మణ్,దళిత సంఘల నాయకులు బొమ్మెర శ్రీనివాస్,మురళి తదితరులు పాల్గొన్నారు.

# అతివల అరచేతి అందం గోరింటాకు!!

- చూసే వారి మనసును దోచే ఎర్రగా పండిన గోరింటాకు
- ఆషాడ మాసం గోరింటాకు వేడుకలు అంగరంగ వైభవంగా
- కందుల సంధ్యారాణి, రామగుండం బిజెపి నేత



**పెద్దపల్లి/ గోదావరిఖని: జూలై 20 (వార్తాప్రభ ప్రతినిధి)** అతివల అరచేతి అందం గోరింటాకు అని సంతోషం వ్యక్తం చేశారు రామగుండం భారతీయ జనతా పార్టీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి. ఈ మేరకు శనివారం రామగుండం నగరపాలక సంస్థ 47వ డివిజన్ పరిధిలో మహిళలతో కలిసి ఆషాడ మాసం గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు సంధ్యారాణి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... చూసే వారి మనసును దోచే ఎర్రగా పండిన గోరింటాకు మహిళలకు ఎంతో ప్రీతికరమైన వేడుక అని అన్నారు. ఆషాడ మాసంలో మహిళలు అందరూ ఒక చోట చేరి గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి అని అన్నారు. ఆషాడమాసం గోరింటాకు వేడుకలలో 47వ డివిజన్ పరిధిలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నరు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రికాషన్స్ తీసుకోండి!!

- అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు
- ఇబ్బందికర పరిస్థితుల్లో డయల్ 100 చేయండి
- ఎం.శ్రీనివాస్, రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్



**పెద్దపల్లి/ రామగుండం: జూలై 20 (వార్తాప్రభ ప్రతినిధి)**భారీ వర్షాల నేపథ్యంలో ప్రికాషన్స్ తీసుకోండి అని ప్రజలకు సూచించారు రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్. ఈ మేరకు శనివారం సిపి కార్యాలయం నుండి పత్రిక ప్రకటన విడుదల చేసి భారీ వర్షాలు కురుస్తున్న తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలను తెలియజేశారు సిపి. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఎవరూ కూడా బయటకు రావద్దు అని సూచించారు. ఇబ్బందికర అంశాలలో డయల్ 100 చేసి వివరాలను తెలియజేయాలి అని అలాగే పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వాహనాలపై ప్రయాణం చేసేటప్పుడు నిదానంగా వెళ్లాలని సూచించారు. కల్వర్టులు, చిన్నచిన్న బ్రిడ్జ్ ల వద్ద నీరు ప్రవహిస్తున్న సమయంలో వాహనాలతో దాటడానికి సాహసం చేయవద్దు అని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, చెట్ల కింద, శిధిలావస్థలో ఉన్న భవనాల కింద ఉండరాదని తెలిపారు.

# స్టేజి టెక్నాలజీ సర్వీస్ డెవలప్మెంట్ చైర్మన్ గా నియమితులైన మన్నె సతీష్ కు ఎమ్మెల్యే గాంధీ శుభాకాంక్షలు



**శేరిలింగంపల్లి,జూలై 20 (వార్తాప్రభ)**:తెలంగాణ రాష్ట్ర స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్మెంట్ చైర్మన్ గా నియమితులైన శుభసందర్భంగా మన్నె సతీష్ కుమార్ ని వారి నివాసంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మరియు చందానగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో మర్యాదపూర్వకంగా కలిసి శాలవతో సత్కరించి శుభాకాంక్షలు తెలియచేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్బర్ ఖాన్, నరేందర్ బల్లా తదితరులు పాల్గొన్నారు.

# శిల్పారామం లో 200 మంది కళాకారులతో "గురువందన" కార్యక్రమం



**శేరిలింగంపల్లి,జూలై 20 (వార్తాప్రభ)**:మాదాపూర్ లోని శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా గురు పౌర్ణిమ పురస్కరించుకొని కందుల కూచి పూడి నాట్యాలయం నాట్య గురువర్యులు రవి కూచిపూడి శిష్య బృందం కూచిపూడి నాట్య "గురు వందన" నిర్వహించడం జరిగింది. శ్లోకాలు,జతులు, మూషిక వాహన,పుష్పాంజలి, నమశ్శివాయుతేయ్, బ్రహ్మాంజలి,పలుకే బంగారమయేన్నా,శివ స్తుతి, రామాయణ శబ్దం,వచ్చెను అలమేలు,కృష్ణం కలయసఖి, నారాయణీయం,వినరో భాగ్యము,జయము జయము, తిల్లాన అంశాలను ప్రదర్శించారు.పూజ్య నాట్య గురువులు ఉత్సాద్ బిస్మిల్లాహ్ ఖాన్ శ్రీ వేదాంతం సత్య నరసింహ శాస్త్రి కి దాదాపుగా రెండు వందల మంది కళాకారులతో గురువందన నిర్వహించారు.గురువు కి పాదపూజ చేసి ఘనంగా సత్కరించారు.హిందూ సేవ సమితి రాధా కృష్ణ,నాట్య గురువులు కుమారి కొక విజయలక్ష్మి,డాక్టర్ పేరిణి రవి తేజ,జానపద సంగీత గాయకులూ విద్యారణ్య చారి ముఖ్య అతిథులుగా విచ్చేసి కళాకారులను అభినందించారు.



# వార్తా ప్రభ హైదరాబాద్

# సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శిగా లావుడియా వెంకటేష్ నాయక్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ లక్ష్మీదేవి పల్లి మండలం గడ్డి గుట్ట గ్రామా నివాసి లావుడియావెంకటేష్ నాయక్ నూ సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సేవలాల్ సేన కోర్ కమిటీ చైర్మన్ త్రీ సభ్య కమిటీ సభ్యులు ధారావత్ ప్రేమ్చంద్ నాయక్ సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోత్ రాంబాబు నాయక్ సేవలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్ రేఖ్య నాయక్ లు నియక ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు ఆయన తెలిపారు తనకు ఇచ్చిన అవకాశాన్ని అభివృద్ధి కోసం కృషి చేస్తానని సేవాలాల్ సేనగా బంజారాలకు చైతన్యవంతులు చేయడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు తనకు అవకాశం ఇచ్చిన సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు

# ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే

■ ఎస్పీ రోహిత్ రాజు




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఇకపై ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుండి ప్రజలు తమ సమస్యలను తెలుపుకునేందుకు వీలుగా "గ్రీవెన్స్ డే" ను ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.కావున ప్రజలు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి నేరుగా తెలుపుకోవడానికి ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుండి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అందుబాటులో ఉండనున్నారు

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో గ్రీన్ డే సెలబ్రేషన్స్




**కుత్బుల్లాపూర్ జూలై 20 (వార్తాప్రభ)** : రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నందానగర్లో, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో, స్కూల్ మేనేజ్మెంట్ వారు ప్రీ ప్రైమరీ విద్యార్థులతో శనివారం నిర్వహించిన గ్రీన్ డే సెలబ్రేషన్స్ కార్యక్రమానికి, ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ,ప్రతి ఒక్కరు ఇంటింటికి మొక్కలను నాటి. పర్యావరాన్ని పరిరక్షించు కోవాలన్నారు. కాలుష్యాన్ని అరికట్టాలంటే పచ్చని చెట్లు ఎంతో అవసరమని, వాటిని సంరక్షించుకోవాలన్నారు. గ్రీన్ డే సెలబ్రేషన్స్ ను నిర్వహించినందుకు పాఠశాల మేనేజ్మెంట్ వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మినీ అరవింద్, అకాడమిక్ డైరెక్టర్ అబ్దుల్ కయుమ్ , కరస్పాండెంట్ అశోక్, ఉపాధ్యాయురాళ్లు పద్మజ, కృష్ణవేణి,రమ్యశ్రీ, జ్యోతి, మౌనిక, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పరిశుభ్రత మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుకుందాం

- 75 వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న 22వ వార్డు కౌన్సిలర్ సంధ్య హనుమంత్ రావు



**దుండిగల్ జూలై 20 (వార్తాప్రభ)** : దుందిగల్ మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు కౌన్సిలర్ సంధ్య హనుమంత్ రావు ఆధ్వర్యంలో 75వ వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...22వ వార్డు లో వున్న ప్రతి ఒక్కరు మొక్కలు నాటి మన ప్రకృతిని కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. అనంతరం అందరికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## జనంలోకి జగన్.. భరోసా దక్కినట్లేనా ?

మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్ చాలా కాలానికి జనంలోకి వచ్చారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు అంతా పరదాల మాటున ఉండేవారు. ఆయన సభలు అలాగే జరిగేవి. జగన్ ని దగ్గరగా చూసేందుకు ఎవరికీ చాన్స్ లేదు.అలా గగన విహారం చేసి వచ్చి సభలో మాట్లాడేసి మళ్లీ వెళ్ళిపోయేవారు. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు జగన్ ని నేల మీదకు తెచ్చాయి. జగన్ పల్నాడు జిల్లా వినుకొండలో వైసీపీ కార్యకర్త రషీద్ దారుణ హత్య తరువాత ఆ కుటుంబాన్ని పరామర్శించారు. జగన్ కారులోనే 120 కిలోమీటర్ల దూరం ప్రయాణించడం ఒక మార్పు అయితే జగన్ కి జనంలో ఆదరణ బాగానే ఉందన్నది తెలియడం మరో విశేషం.జగన్ నేల విడిచి సాము చేయడం వల్లనే గత ఎన్నికల్లో ఓటమి పాలు అయ్యారు. సీఎం అయ్యాక ఆ పదవిలో అలాగే ఉంటాను అనుకున్నారో లేక ఎన్ని సార్లు ఎన్నికలు పెట్టినా జనం తననే గెలిపిస్తారు అనుకున్నారో తెలియదు కానీ జనం వద్దకు ఆయన పోలేదు.దాంతో జనాలకు జగన్ 2019 తరువాత కనిపించడమే లేదు అన్న అసంతృప్తి కూడా ఓటమికి కారణం అయింది ఏది ఏమైనా భారీ ఓటమి జగన్ కి వైసీపీకి కూడా ఏమి కోల్పోయామో తెలియచేసింది. నాలుగు గోడల మధ్య ఉంటే ఫీడ్ బ్యాక్ రాదు. ఒకవేళ సలహాదారులు ఎవరు ఇచ్చినా అది జనం ఫీడ్ బ్యాక్ కానే కాదు. గ్రౌండ్ లెవెల్ రియాల్టీస్ తెలియాలీ అంటే జనంలోనే ఉండాలి.జగన్ మాత్రం ఐప్యాక్ టీములను నమ్మారు. తన చుట్టూ ఒక కోటరీ ఏర్పాటు చేసుకున్నారు. వారి సలహాలతో అంతా ముందుకు సాగారు. బటన్ మీకోసం వందల సార్లు నొక్కాను నా కోసం రెండు సార్లు నొక్కరా అని జగన్ అడిగినపుడే ఆయన అయిదేళ్ల పాలన ఏమిటి అన్నది ఆయనే చెప్పినట్లు అయింది. జనాలకు పథకాలు కావాలి. కానీ వాటితో పాటుగా ముఖ్యమంత్రిగా జగన్ కూడా కనిపించాలి.కానీ ఇక్కడ జరిగింది మాత్రం వేరుగా ఉంది. అందుకే జనాలు ఓడించారు. విపక్షాలు అలుపెరగక తిరుగుతూ జనంలో ఉంటే జగన్ మాత్రం తాడేపల్లి ప్యాలెస్ లో ఉన్నారు అన్న విమర్శలు వారి బుర్రలోకి ఎక్కాయి. అలా జనాలకు దూరం అయిన జగన్ ఇన్నాళ్ళకు తిరిగి వారి వద్దకే వచ్చారు.ఒక విధంగా చూస్తే తన బలం బలహీనతలు రెండూ జగన్ ఈ పర్యటనలో చూశారు అని అంటున్నారు. జనాలకు దూరం కావడమే తన బలహీనత అని ఆయన గ్రహించడం మొదలు పెడితే చాలు వైసీపీలో మార్పు తప్పకుండా వస్తుందని అంటున్నారు. అలాగే తన పట్ల ఆదరణ కనబరుస్తున్న జనాలకు ఎల్లప్పుడూ చేరువ కావాలని జగన్ చేసే ప్రతీ ప్రయత్నమూ సక్సెస్ అవుతుందని నిన్న పులివెందుల టూర్ నేడు వినుకొండ టూర్ చాటి చెప్పాయని అంటున్నారు.ప్రజలతో మమేకం కావడం వారి పక్షాల పోరాటం చేయడం ద్వారానే జగన్ తాను పోగొట్టుకున్న అధికారాన్ని దక్కించుకోగలరు అని అంటున్నారు. అదే సమయంలో జగన్ వైసీపీ క్యాడర్ కి భరోసా ఇవ్వడానికి వస్తే జనాలు ఆయనకు కావాల్సినంత భరోసా ఇచ్చారు.జనాలు ఓటు వేయలేదని లేదా వేసిన ఓట్లు ఏమయ్యాయి అని మధన పడడం నిన్నటి మాట. ఇపుడు జనాలలో ఉన్న అభిమానాన్ని ఎలా మళ్ళీ తన పార్టీ ఉన్నతికి ఉపయోగించుకోవాలి అన్నది జగన్ ఆలోచించాలని అంటున్నారు. ఇక టీడీపీ కూటమి ప్రభుత్వానికి హామీల విషయంలో టైం ఇవ్వాలి.అలాగే ప్రజాస్వామ్యాన్ని నమ్మిన వారు రాష్ట్రపతి పాలన వంటి డిమాండ్లు చేయరు. కొత్త ప్రభుత్వం ప్రజలు భారీ తీర్పుతో అధికారం కట్టబెట్టారు. తప్పులు జరిగితే వాటికి చట్ట ప్రకారం శిక్షలు ఉండాలని డిమాండ్ చేయాలి తప్ప ఈ ప్రభుత్వం వద్దు అని తొలినాళ్ళలోనే కోరడం కూడా తప్పుడు సంకేతాలకు దారి తీస్తుంది అని గ్రహించాలి. అంతే కాదు నిర్మాణాత్మకమైన ప్రతిపక్షం పాత్ర పోషించడం ద్వారానే జనం మన్ననలు పొందాల్సి ఉంటుంది. ప్రభుత్వం చేసే మంచి పనులను మెచ్చుకుంటే వారు చేసే పొరపాట్లను విమర్శిస్తే విలువు పెరుగుతుంది. మొత్తం మీద చూస్తే జనం భరోసా అయితే జగన్ కి దక్కింది అని అంటున్నారు. ఆ మీదట ఆయన అడుగులు ఎలా ముందుకు సాగుతాయో చూడాల్సి ఉంది.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు జాగ్రత్తలు వివరించాలి

**రాయదుర్గం జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాయదుర్గం పట్టణంలో ద్వామాహాలులో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

## బామ్మ గారి మాటలు



తగ్గించును గౌరవము
పనికిరాని బుద్ధులు
విసిగించును మనసులు
పసలేని సుద్దులు
దేవునితో ఆటలు
అగ్గితో చెలగాటము
గాలిలోన రాతలు
గురువులేని చదువులు
నిస్సారపు ఊటలు
వదరుబోతు కోతలు
అధికమైన కలతలు
మదిని నిప్పు రవ్వలు
చూడ ఎండమావులు
నీతి లేని మనుషులు
నీరింకిన బావులు
ప్రేమ లేని మనసులు

**-గద్వాల సోమన్న**
9966414580

## తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్ ఎస్ బేగ్



**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో గాజువాక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాజా రాజకీయ పరిణామల పై చర్చించారు.వైసీపీ నాయకులు తెదేపా ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం తిప్పికొట్టాలని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన కావాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడ్డం విడ్డురంగా వుందని వారిమధ్య చర్చ జరిగింది. వైసీపీ కుయుక్తులు తిప్పికొట్టాలని దానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్ తెలిపారు.

## శ్రీ బెజవాడ కనకదుర్గమ్మ కి శ్రీ శైలం మల్లన్న నుండి పవిత్ర ఆషాఢ సారె సమర్పణ



**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆషాఢ మాసంలో సంప్రదాయం ప్రకారం ప్రతియేటా శ్రీశైలం నుండి బెజవాడ కనకదుర్గమ్మ కి ఆషాఢ మాసం సారె సమర్పించడం జరిగుతుంది.ఆ సంప్రదాయం ప్రకారంశ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి పై శనివారం ఆషాడ మాసం సందర్భంగా దేవస్థానం నందు శ్రీ అమ్మవారికి పవిత్ర సారె సమర్పించు కార్యక్రమంలో భాగంగా శ్రీశైల శ్రీ భ్రమరాంభికా మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానం శ్రీశైలం నుండి ఆలయ కార్యనిర్వాహణాధికారి డి. పెద్దిరాజు దంపతులు మరియు ఆలయ అధికారులు కనకదుర్గ అమ్మవారికి ఆషాడ సారె సమర్పించుటకు వచ్చారు. వీరికి దుర్గ గుడి ఆలయ కార్యనిర్వహణాధికారి కె ఎస్ రామరావు ఆలయ మర్యాదలతో మంగళ వాయిద్యముల నడుమ స్వాగతం పలికారు. అనంతరం వీరు అమ్మవారిని దర్శనం చేసుకొని అమ్మవారికి సారె సమర్పించారు. తరువాత వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా కార్యనిర్వహణాధికారి కె ఎస్ రామరావు శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రము, చిత్రపటం అందజేసినారు. అనంతరం శ్రీశైలం దేవస్థానం వారు శ్రీ దుర్గ గుడి కార్యనిర్వాహనాధికారి కి మరియు సిబ్బందికి శ్రీశైలం దేవస్థానం శేషవస్త్రం, ప్రసాదములు మరియు చిత్రపటము అందజేశారు.అలాగే మహామండపం 6వ అంతస్తు నందు దేవస్థానం వారు ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి, అందరికీ ఆశీర్వాదం అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ వైదిక సిబ్బంది, సహాయ కార్యనిర్వాహనాధికారి , శ్రీశైలం దేవస్థానం అర్చకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై రెండోరోజు వైభవంగా శాకాంబరీ ఉత్సవాలు

### ఆలయ ప్రాంగణంలో భక్తులను ఆకట్టుకున్న కూరగాయలతో అలంకరణ



**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో,ఆలయ ప్రాంగణంలో శనివారం కూరగాయలతో చేసిన అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. రెండోరోజు జరిగిన శాకాంబరీ వేడుకల్లో వేలాదిమంది భక్తులకు అమ్మవారి ని దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రి పై శ్రీ అమ్మవారి శాకంబరీ దేవి ఉత్సవములు 2 వ రోజు .ఈరోజు శాకంబరీ దేవి ఉత్సవములు సందర్భంగా ఆకుకూరలు మరియు



కూరగాయలుతో అలంకరించిన దేవస్థానం ప్రాంగణములు, శ్రీ అమ్మవారు, ఉపాలయములలోని దేవతామూర్తులు, మరియు ఉత్సవ మూర్తులను కూడా ప్రత్యేకంగా అలంకరించారు.మూడు రోజుల పాటు దేవస్థానం నందు అంగరంగ వైభవముగా జరగుచున్న శ్రీ అమ్మవారి శాకంభరీ దేవి ఉత్సవముల్లో ఆలయంలోకి అధికారులు తయారు చేయించిన కదంభం ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. నిన్నటి నుండి విశేషముగా విచ్చేస్తున్న భక్తుల కొరకు తగు ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు. భక్తులకు చౌకర్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు.అలంకరణ నిమిత్తం పెద్ద మొత్తంలో ఆకుకూరలు, కాయగూరలు విరాళముగా అందజేసిన భక్తులు. మొక్కలు తీర్చుకొన్నారు.ఈ 3 రోజుల పాటు భక్తులందరికీ ప్రసాదముగా వివిధ రకముల ఆకుకూరలు, కాయగూరలతో వండిన కదంబం ప్రసాదం పంపిణీ చేస్తూ అధికారులు, సిబ్బంది సేవలు అందించారు.శ్రీ అమ్మవారికి శాకంబరీదేవి గా కూరగాయలు, ఆకుకూరలు మరియు పండ్లతో విశేషముగా అలంకరణ చేసి పూజ వైదిక కార్యక్రమాలు నిర్వహించిన భూలోకములో సకాలములో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు మరియు రైతులు సుఖ-శాంతులు మరియు సంతోషాలతో జీవించుదురని, వైదిక కమిటి వారు తెలిపినట్లు ఆలయ ఈవో కె ఎస్ రామరావు ఒక ప్రకటనలో తెలిపారు..

### పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో

## మల్లిఖార్జున పేట ఉప్పర వాగు కొండపై విష సర్పాలు, పురుగుల నివాస పిచ్చిమొక్కలు తొలిగింపు



**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో కొండప్రతాల్లో ప్రజలు ఇబ్బందులు తొలుగుతున్నాయని ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మల్లిఖార్జున పేట కొండప్రతాల్లో ఉప్పర వాగులు వద్ద పిచ్చిమొక్కలువిపరీతంగా పెరిగిపోయి చెత్త చెదారం తో పాటు విషజీవులకు ఆవాసంగా మారిగా మల్లికార్జున పేట ఉప్పర వాగు కొండపై పారిశుద్ధ్య సమస్యల ను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు కార్పొరేషన్ సిబ్బంది సమస్య పరిష్కరించారు. సంబంధిత సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కార్పొరేషన్ అధికారులకు తెలియజేయగానే వెంటనే సిబ్బంది ఈ ప్రాంతానికి వచ్చారు.కొండపైన పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించి ఈ ప్రాంతమంతా శుభ్రపరిచే కార్యక్రమం పారిశుద్ధ్య కార్మికులు చేపట్టారు. తమ సమస్యను ఆలకించి పరిష్కారం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి మల్లికార్జున పేట ప్రాంతవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు

## రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో వర్షపు నీరు!!!

### తడిసి ముద్దయిన పలు రికార్డులు!!!



**మచిలీపట్నం జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం శనివారం నాలుగు రోజుల నుంచి ఎడతెరప లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మచిలీపట్నం డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరాయి. కార్యాలయం లోపలకు వర్షపు నీరు రావటంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రికార్డ్ రూమ్ లో సైతం వర్షపు నీరు చేరటంతో పలు రికార్డులు నీటితో తడిసి ముద్దయ్యాయి. రెవెన్యూ డివిజనల్ కార్యాలయం లోపలికి వర్షపు నీరు చేరడంతో కార్యాలయం సిమ్మింగ్పూల్ ను తలపించింది. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది వర్షపు నీటిలోనే కార్యాలయంలో కష్టతరంగా విధులు నిర్వహించారు.బ్రిటిష్ వారి కాలంలో నిర్మించిన ఆర్డీవో కార్యాలయం కు ఇటీవల కాలంలో మరమ్మతులు నిర్వహించారు. కార్యాలయంలో నిర్వహించిన మరమత్తులలో నాణ్యత లేకపోవడంతో గత మూడు,నాలుగు రోజుల నుండి ఎడతెరప లేకుండా కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు కార్యాలయంలోనికి చేరటం తో కార్యాలయంకు నిర్వహించిన మరమ్మత్తుల నాణ్యతను పలువురు ప్రశ్నిస్తున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి కార్యాలయం లోని రికార్డులు వర్షపు నీటితో తడిసిపోవడంతో రికార్డుల భద్రత ప్రశ్నార్థకం గా మారింది..



కార్యాలయ సిబ్బందికి రికార్డు భద్రత విషయం తలనొప్పిగా మారింది. రాత్రి సమయంలో కురిసిన వర్షాలకు రికార్డులు వర్షపు నీటితో తడవడం, కార్యాలయం పనివేళలో సిబ్బంది ఆఫీస్ టేబుల్ పై రికార్డులను ఆరబెట్టటం దినచర్యగా మారింది. ఆర్డీవో కార్యాలయంలో ఉన్న విలువైన రికార్డులు వర్షపు నీటి తో తడవడం వాటిలో ఉన్న సమాచారం కనిపించకుండా కనుమరుగైపోతుంది. ఆర్డీవో కార్యాలయం రికార్డులలోని సమాచారం వర్షపు నీటితో తడిచి కనిపించకుండా పోతే మోసగాళ్లకు బలం చేకూరుతోందనీ కొంతమంది పదవి విరమణ పొందిన ఉద్యోగులు వాపోతున్నారు.వర్షపు నీరు ఆర్డీవో కార్యాలయం రికార్డ్ రూమ్ లోపలికి రావడం కార్యాలయం లోని రికార్డు రూమ్ పాములకు ఆవాసాలుగా మారతాయని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఆర్డీఓ కార్యాలయంలో విధులు నిర్వహించడానికి భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విలువైన సమాచారం తో పొందుపరిచిన రికార్డు రూమ్ లో వర్షపు నీరు చేరకుండా వర్షపు నీటితో రికార్డులు తడవకుండా భద్రపరచాలని ప్రజలు కోరుకుంటున్నారు

## కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సారధ్యంలో నేడే మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం



**కనిగిరి జూలై 21 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సారధ్యంలో, జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర్ కంటి ఆసుపత్రి, మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 2008లో ప్రారంభించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాలతో నియోజకవర్గంలో ఎంతోమందికి కంటి చూపును ప్రసాదించిన ఉగ్ర నరసింహారెడ్డిని నియోజకవర్గం ప్రజలు అభినందిస్తున్నారు. నేడు అమరావతి గ్రౌండ్స్ లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. 48,892 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు, 23,273 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు, 22,650 మందికి ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేసి నియోజకవర్గంలో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న మహానుభావుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి అని కనిగిరి నియోజకవర్గం ప్రజానీకం ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

## ఎం.పి కేశినేని శివనాథ్ (చిన్ని) ను కలిసిన టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్



**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్ లో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపి కేశినేని శివనాథ్ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కు సాదర స్వాగతం పలికారు. పల్లా శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందించి ఎంపి కేశినేని శివనాథ్ ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకొన్నారు. అనంతరం పల్లా శ్రీనివాస్ కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఎంపి కేశినేని శివనాథ్ సత్కరించారు. ఆ తర్వాత ఇద్దరు టిడిపి పై వైసిపి అధ్యక్షుడు జగన్ చేస్తున్న దుష్ప్రచారం పై, రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుంచి అందుకోవాల్సిన సాయం పై చర్చించుకున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నుండి శ్రీ కనకదుర్గమ్మ కి చేరిన ఆషాడ సారె



**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై శనివారం ఆషాడ మాసం సందర్భంగా దేవస్థానం నందు శ్రీ అమ్మవారికి పవిత్ర సారె సమర్పించు కార్యక్రమంలో భాగంగా శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక దేవి సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామివార్ల దేవస్థానం, శ్రీకాళహస్తి నుండి ఇంద్రకీలాద్రి పై నున్న శ్రీ కనకదుర్గ అమ్మవారికి పవిత్ర సారె వచ్చింది. ఈ సారె సమర్పించుటకు గాను శ్రీకాళహస్తి శాసనసభ్యులు శ్రీ బొజ్జల శ్రీధర్ మరియు శ్రీకాళహస్తి ఆలయ ఉప కార్యనిర్వాహణాధికారి ఎన్ ఆర్ కృష్ణా రెడ్డి, మరియు అధికారులు అమ్మవారికి ఆషాడ సారె సమర్పించుటకు విచ్చేయగా వీరికి దుర్గ గుడి ఆలయ కార్యనిర్వహణాధికారి కె ఎస్ రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు అమ్మవారిని దర్శనం చేసుకొని అమ్మవారికి పవిత్ర సారె సమర్పించారు.అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రము, చిత్రపటం అందజేశారు. అనంతరం శ్రీకాళహస్తి శాసనసభ్యులు వారు దుర్గ గుడి కార్యనిర్వాహనాధికారి కి శ్రీ కాళహస్తి దేవస్థానం శేషవస్త్రం, ప్రసాదములు మరియు చిత్రపటములు అందజేశారు.

## నిమ్రా మెడికల్ కళాశాల అధ్యాపకుడు జాన్ బాషా కు పిహెచ్ డి



**ఇబ్రహీంపట్నం జూలై 20(వార్తా ప్రభ ప్రతినిధి):** -నిమ్రా మెడికల్ కళాశాలలో అధ్యాపకుడిగాపనిచేస్తున్న షేక్ జాన్ బాషా కు తమిళనాడుకు చెందిన సవిత యూనివర్సిటీ పిహెచ్ డి డిగ్రీ సోమవారం నాడుప్రధానం చేసింది. 'ఎవల్యూషన్ ఆఫ్ ప్లాస్మా నైట్రోథైరోసిన్, ఎపిలిన్ యాజ్ నావెల్ బయో మార్కర్స్ ఆఫ్ ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఇన్ టైప్ - 2 డయాబెటిస్ మిల్లిటస్ పేషంట్స్' అనే అంశంపై పరిశోధనాత్మక గ్రంథాన్ని డాక్టర్ డి షీలా పర్యవేక్షణలో సవిత యూనివర్సిటీలో సమర్పించినందుకు బయో కెమిస్ట్రీ విభాగంలో పిహెచ్ డి డిగ్రీ ప్రధానం చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిమ్రా విద్యా సంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినేని నారాయణమూర్తి, మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ కృష్ణమూర్తి, అకాడమిక్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ బాబులాల్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయరాం, డాక్టర్ షబానా,డాక్టర్ శాంతి,సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు జాన్ భాషను అభినందించారు.

## ధర్మవరము మండలంలో దారుణ హత్య

**ధర్మవరం జూలై 20(వార్తా ప్రభ ప్రతినిధి):**ధర్మవరం మండలం కొత్తకోట గ్రామం సమీపంలో శనివారం దారుణ హత్య జరిగింది. చాకలి సూర్యనారాయణ అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చారు. రాళ్లతో కొట్టి చంపినట్లు తెలుస్తోంది. సూర్యనారాయణ స్వగ్రామం తాడిమర్రి కాగా వివాహ అనంతరం వెల్దుర్తిలో నివాసం ఉంటున్నాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

# విజయవాడకొండ ప్రాంతాల్లో అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ 100 కోట్లు ప్రత్యేక గ్రాండ్ ఇవ్వాలి

○ సీపీఎమ్ రాష్ట్ర కార్యదర్శి సి హెచ్ బాబూరావు డిమాండ్

**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలో కొండప్రతాల్లో అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ 100 కోట్లు గ్రాండ్ ఇవ్వాలని సీపీఎమ్ రాష్ట్ర కార్యదర్శి సి హెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. విజయవాడ నగరంలో గత నాలుగు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు వల్ల కొండ ప్రాంతాల్లో పలుచోట్ల రిటైనింగ్ వాల్స్ బండ రాళ్లు పడి ప్రజల ఆస్తులు ధ్వంసం ఆయన సంఘటనపై ప్రజలు భయాందోళనలతో జీవిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు తెలిపారు.శనివారం పశ్చిమ నగరంలో పలు ప్రాంతాల్లో సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించడం జరిగింది. 50వడివిజన్, 51 వ డివిజన్ కొండ ప్రాంతాలు ప్రజలను కలిసి మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా సిహెచ్ బాబురావు పశ్చిమ నగర సిపిఎం కార్యదర్శి సిపిఎం ఫ్లోర్ బోయి సత్యబాబు 50 వడివిజన్ కార్పొరేటర్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో 16 డివిజన్ల లో కొండ ప్రాంతాల్లో రెండు లక్షల మంది ప్రజలు నివాసం ఉంటున్నారని వారి మౌలిక సదుపాయాల కోసం రిటైనింగ్ వాల్ మెట్లు ట్రైన్లు రోడ్ల నిర్మాణానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు కొండ ప్రాంతాలకు 22వ తేదీ నుండి జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో రూ 100 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో విజయవాడకు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలుమార్లు కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ కొండలు జారిపడి పలువురు మరణించిన పరిస్థితి అనేకమంది గాయాలు పాలై ఆస్తులు ధ్వంసం అయినటువంటి పరిస్థితి నేటికీ కొనసాగుతూనే ఉందని ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు ప్రజాప్రతినిధులు కొండ ప్రాంతాల ప్రజల ప్రాణాల రక్షణకు గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార ప్రతిపక్ష పార్టీలు హత్య రాజకీయాల విషయమై దృష్టి సారిస్తూ ప్రజల ప్రాణాలను వారి బాధలను గాలికి వదిలేసారని తెలిపారు. కొత్తపేట రాజగిరి వారి వీధిలో రిటైనింగ్ కూలిపోయిన స్థానంలో రిటైనింగ్ వాల్ నిర్మించి పక్కా గృహాలు పేదలకు నిర్మించిఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.భూగర్భ డ్రైనేజీ నిర్వహణ చేయనందున యూజీడి కలెక్షన్లు తొలగించుకొని మరల పాత పద్ధతిలోనే కొండ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. వాటర్ పైప్ లైన్లు లీకేజ్ లై మంచినీరు సక్రమంగా అందక అవస్థలు పడుతున్నారని వెంటనే లీకేజీ పైప్లైన్లు మార్చి మంచినీటి ఇబ్బందులు తొలగించాలని కోరారు. నగర మేయర్ కొండ ప్రాంతాల సమస్యలపై వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు పరిష్కరించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సిపిఎం నగర కార్యదర్శి కమిటీ సభ్యులు ఇవి నారాయణ. పి రాజు డివిజన్ నాయకులు జి నాగరాజు పి మహేష్ ఆవాజ్ నాయకులు ఎస్ డి భాష, సిఐటియు నాయకులు బి రాము సిహెచ్ దుర్గారావు. సత్యనారాయణ. బి రవి తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తాను

○ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)



**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నాగపూర్–విజయవాడ 163(జి) గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులు, తాము ఇచ్చిన భూముల తాలుకా నష్టపరిహారం ఇప్పించాల్సిందిగా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ను శనివారం రైతులు కలిశారు. ఖమ్మం నుంచి విజయవాడవరకు నిర్మించే నాగపూర్–విజయవాడ 163(జి) గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే మార్గంలో భూములిచ్చిన మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన రైతులు గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో శనివారం ఎంపి కేశినేని శివనాథ్ ను కలిసి భూములిచ్చి నష్టపరిహారం కోసం ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో వివరించారు. గ్రామంలో 170 మంది హైవే నిర్మాణం కోసం భూమువిల్వగా వారిలో 60 మంది మాత్రమే నష్ట పరిహారం అందిందని తెలిపారు. మిగిలిన 110 మందిలో 20 మందికి మాత్రమే అవార్డ్ కాపీ వచ్చిందని...మిగిలిన 90 మందికి అవార్డ్ కాపీ కూడా రాలేదని తెలియజేశారు. వీరిలో కొంతమంది భూముల్లో రాళ్లు పాతటం జరిగిందని..అయితే వారి పేర్లు గెజిట్ లో నమోదు కాలేదన్న విషయం వివరించారు. ఈ విషయం పై ఎంపి కేశినేని శివనాథ్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి అందరికీ నష్టపరిహారం అందిచేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కవులూరు రైతులు ఎంపి కేశినేని శివనాథ్ ను శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు జంపాల సీతారామయ్య, భోగినేని రవీంద్ర రావు, రైతు సంఘం నాయకుడు చెరుకూరి వేణుగోపాల్, భోగినేని సూర్య ప్రకాష్, బుద్ది మల్లేశ్వరరావు,చెరుకూరి సుబ్బారావు, బొర్రా అశోక్ లతో పాటు కవులూరు రైతులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా మాంసం, చేపలు విక్రయిస్తే చర్యలు

– మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ హెచ్చరిక



**ఇబ్రహీంపట్నం, జులై 20 (వార్తా ప్రభ ప్రతినిధి):**– నాణ్యమైన మాంసం, చేపలు విక్రయించని వ్యాపారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ వై.శంకర్ నాయక్ హెచ్చరించారు. పురపాలక సంఘం కార్యాలయంలో చికెన్, మటన్, చేపల వ్యాపారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ధ్రువీకరించిన నాణ్యమైన మాంసం, చేపలు మాత్రమే విక్రయించాలన్నారు. వ్యాపారస్థులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మాంసం, చేపలు విక్రయించవద్దన్నారు. మాంసం, చేపల దుకాణాల వద్ద వీధి కుక్కలు కనిపించకుండా చూడాలన్నారు. మాంసం, చేపల వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పడేయకుండా మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వ్యాపారులపై ప్రజారోగ్యం మరియు పురపాలక చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ



**ఇబ్రహీంపట్నం, జులై 20 (వార్తా ప్రభ ప్రతినిధి):**– గుంటుపల్లి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ భూక్యా కవిత చేతుల మీదుగా శనివారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల సేవలు వెల కట్టలేనివన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమించే పారిశుధ్య కార్మికులు వర్షా కాలంలో తడిసి అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు రెయిన్ కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు చెత్తా చెదారాన్ని ఎక్కడబడితే అక్కడ పడేయకుండా చెత్త కుండీలను ఉపయోగించి పారిశుధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.మునేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కోదండ రామస్వామి వారి సేవలో రావి లక్ష్మీ నరసారెడ్డి



**చేజర్ల జులై 20 (వార్తాప్రభ)** గ్రామం పడమటి వీధిలోని శ్రీ సీతా లక్ష్మణ హనుమాన్ సమేత కోదండ రామస్వామి వారి దేవస్థానంలో వార్షిక తిరు కళ్యాణం మహోత్స వంలో భాగంగా ఈరోజు స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరిగింది. కళ్యాణ మహోత్సవానికి చేజర్ల గ్రామ మాజీ సర్పంచ్ మండల టిడిపి అధ్యక్షులు రావి లక్ష్మీ నరసారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి కళ్యాణ మహోత్సవం జరిపి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# ఆయిల్ పామ్ తోటల సాగు పై రైతులకు అవగాహన సదస్సు!!!



**మచిలీపట్నం జులై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి )**మచిలీపట్నం శనివారం జిల్లాలో ఆయిల్ పామ్ తోటల సాగు వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయని రైతులకు తెలియజేసి వారిని ఆ దిశగా మొగ్గు చూపేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. అవనిగడ్డ ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ మెగా మేళా – ఆయిల్ ఫామ్ సాగుపై గ్రామస్థాయి ఉద్యాన, వ్యవసాయ శాఖల సహాయ సిబ్బందికి, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ సాగు చేయుట కోసం రైతులకు ఎన్నో ప్రయోజనాలు అందిస్తోందన్నారు. జిల్లా యంత్రాంగం కూడా ఆయిల్ పామ్ తోటల సాగు పట్ల చాలా శ్రద్ధ వహిస్తోందన్నారు. ప్రభుత్వం నూటికి నూరు శాతం సబ్సిడీ అందజేస్తుందని మంచి మొక్కలను ఎంపిక చేసుకొని సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. తుఫాను, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల వలన ఆయిల్ పామ్ పంటకు నష్టం జరగదన్నారు.బిందు, తుంపర్ల సేద్యం వంటి సూక్ష్మ సేద్యాల వలన నీటి అవసరం కూడా తక్కువ ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వమే ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఆయిల్ పామ్ తోటల సాగులో అంతర పంటలు కూడా వేసుకోవచ్చున్నారు. మొదటి నాలుగు సంవత్సరాలు పెద్దగా ఆదాయం రాదని ఆ తరువాత నుండి 40 సంవత్సరాల వరకు దిగుబడి, ఆదాయము ఉంటుందన్నారు. ఎరువులు, కలుపు మొక్కల తొలగింపు వంటి పంట నిర్వహణ కోసం కూడా హెక్టారుకు 5,625 రూపాయలను ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ఆయిల్ పామ్ చట్టం ఉందని దాని ప్రకారం మార్కెట్లో ధర నిర్ణయించడం జరుగుతుందని, వివిధ కంపెనీలు అంగీకారం తో వారే మొక్కలు సరఫరా చేయడంతో పాటు సేకరణ కేంద్రాల ద్వారా గెలలు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఎనిమిది సంవత్సరాల తర్వాత హెక్టారుకు 8 టన్నుల దిగుబడి వస్తుందని, 15 రోజులకు ఒకసారి గెలలు కోతకోయవచ్చని 50వేల రూపాయలు మిగులు ఉంటుందన్నారు. ఉద్యోగ జీవితంలో ఇటువంటి సేవలు అందించడం ద్వారా వారికి చెప్పుకోదగ్గ గుర్తింపు ఉంటుందన్నారు. అంతకుమునుపు జిల్లా ఉద్యాన అధికారి జె జ్యోతి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మంజువాణి ఎంపిక చేసుకోవలసిన భూమి, ఆరోగ్యకరమైన మొక్కలు, వనరులు, ప్రభుత్వ సహాయము, ఆయిల్ పామ్ తోటల పెంపకం ఎలా చేయాలి, తెలుసుకోవాల్సిన మెలకువలు లాభాలు తదితర అంశాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి, ఏపీఎంఐపి పిడి విజయలక్ష్మి, ఎంపీడీవో మరియాదేవమ్మ, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఉద్యాన వ్యవసాయ శాఖల సహాయక సిబ్బంది, వివిధ ఆయిల్ ఫామ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మేజర్ ఔట్ ఫాల్ డ్రైన్ పూడికలు తీయండి

○ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడండి ○ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ ఏ మహేష్ అధికారులకు ఆదేశాలు



**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి )** విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ ఏ మహేష్ తన పర్యటనలో భాగంగా శనివారం ఉదయం బెంజ్ సర్కిల్ నేషనల్ హైవే, గురునానక్ కాలనీ రోడ్, ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్, కొమరయ్య స్ట్రీట్, ఓల్డ్ రాజరాజేశ్వరి పేట, నిజాం గేట్ ప్రాంతాలు తిరిగి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు.ముందుగా బెంజ్ సర్కిల్ దగ్గర ఉన్న వర్షపు నీటి నిలువలను చూసి ఎయిర్టెక్ మిషన్స్ తో వెంటనే నీటి విలువలను క్లియర్ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తదుపరి గురునానక్ కాలనీ రోడ్డు పరిశీలించి అక్కడ రోడ్డుపై ఉన్న పెద్ద గుంటలు, వర్షపు నీటి నిల్వల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి వెంటనే వెట్ మిక్స్ తో గుంటలు పూడ్చేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తదుపరి ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డు లో తీవ్రంగా నిలిచి ఉన్న వర్షపునీటి నిలువలను గమనించి అక్కడున్న డ్రైనలలో పూడికలు తీపించడమే కాకుండా వర్షపు నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా వెళ్లేటట్టు ఏర్పాటు చేయమని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తదుపరి సర్కిల్ 2 పరిధిలో ఉన్న కుమరయ్య వీధి లో మేజర్ ఔట్ ఫాల్ డ్రైన్ ను పరిశీలించారు. ఈ డ్రైన్ బ్లాక్ అవడం వల్ల ఏలూరు రోడ్ లో వర్షం నీటి నిలువలు నిల్వ ఉండటం గమనించి వెంటనే ఈ డ్రైన్ లో ఉన్న పూడికలను తీపిచ్చి వర్షపు నీటి ప్రవాహం సక్రమంగా జరిగేటట్టు చూశారు. అలాగే 57వ డివిజన్ ఓల్డ్ రాజరాజేశ్వరి పేట ఔట్ ఫాల్ డ్రైన్ ని పరిశీలించి అందులో ఉన్న పూడికలను కూడా వెంటనే తీసివేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నిరంతరం ఇంజనీరింగ్ సిబ్బంది పారిశుద్ధ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు వర్షపు నీటి నిలువలను శుభ్రపరుస్తూ ఉండాలని, సానిటరీ సూపర్వైజర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలి అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం సర్కిల్ వన్ పరిధిలో ఉన్న నైజాం గేట్ మేజర్ అవుట్ఫాల్ట్ డ్రైన్ ను పరిశీలించారు.విజయవాడ నగర పరిధిలో కొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలని అప్రమత్తం చేస్తూ, వారిని వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు చేరేలా చూసుకోవాలని జోనల్ కమిషనర్లు మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను ఆదేశించారు. సెక్రటరీలందరూ, సానిటరీ సూపర్వైజర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్ లందరూ అప్రమత్తంగా ఉంటూ ఫీల్డ్ లో విధులు నిర్వహించాలని విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటానని ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ ఎ మహేష్ హెచ్చరించారు.

# జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలి మంత్రి కొల్లు రవీంద్ర!!!



**మచిలీపట్నం జులై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి )**మచిలీపట్నం శనివారం జిల్లాలోవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. మంత్రి శనివారం ఉదయం తమ నివాసంలో కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు డీకే బాలాజీ, సృజనలకు ఫోన్ చేసి ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలకు నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎగువ నుండి వస్తున్న వరదను, ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్ఫ్లో ఎప్పటికప్పుడు గమనిస్తూ అధికారులకు తగు ఆదేశాలు జారి చేయాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ పనులు ముమ్మరం కానున్న తరుణంలో మాన్సూన్ వల్ల రాష్ట్రంలో వర్షాలు బాగా పడుతున్నాయని, వర్షాలు పడడం శుభ పరిణామం, కానీ గత ప్రభుత్వంలో ఇరిగేషన్ కాలువలు డ్రైన్స్ సరైన నిర్వహణ లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అధికార యంత్రాంగాన్ని వెంటనే అప్రమత్తం చేశారని అన్నారు. శానిటేషన్ మెరుగుపరచాలని వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్ఫ్లో ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతంలో లోతట్టు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

# జోరు వానలకు కొండ రాళ్లు విరిగిపడి ఇళ్ళు ధ్వంసం

○ సంఘటన స్థలాన్ని సందర్శించిన వైసీపీ నాయకులు మైలవరపు కృష్ణ



**విజయవాడ పశ్చిమ, జులై 20,(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని స్థానిక 45 డివిజన్ సొరంగం వద్ద కొండ ప్రాంతంలో రాళ్లు ఇంటి పిట్ట గోడపై పడగా పిట్టగొడ విరిగిపడి కింద ఇళ్ళు ధ్వంసం అయింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలు కాకపోయినా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. శనివారం జరిగిన ఈ సంఘటన సమాచారం అందుకున్న వెంటనే 45వ డివిజన్ నాయకులు మైలవరపు కృష్ణ అక్కడికి వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వర్షాలకు కొండ రాళ్లు జారకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. కొండ రాళ్లు జారిపడి ఇల్లు ధ్వంసమైన గురజాపు సూరమ్మ, గురజాపు లక్ష్మణరావు, గురజాపు లక్ష్మీ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణతోపాటు ఉండబట్ల వెంకటరావు, సాయి,వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కె.ఆర్.ఎం.బి.) కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయించాలి

○ ఆంధ్ర రైతులు నీటి హక్కులు కాపాడాలి ○ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కు వినతిపత్రం అందజేత



**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు ఆధ్వర్యంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టరు పెమ్మసాని చంద్రశేఖర్ కి శనివారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎన్.డి.ఎ. ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో గత విధ్వంసక వై.సి.పి. ప్రభుత్వంలో అనాలోచితంగా కృష్ణా బేసిన్ దాటి విశాఖపట్నంలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కె.ఆర్.ఎం.బి.) ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని పునఃసమీక్షించి కె.ఆర్.ఎం.బి. కార్యాలయాన్ని గత కేంద్ర ప్రభుత్వం (2014– 19), రాష్ట్ర ప్రభుత్వం (2014–19) నిర్ణయాలను అమలుచేసి అన్ని వసతులు వున్న కృష్ణా బేసిన్ అమరావతి రాజధాని అంతర్భాగమైన విజయవాడ పట్టణంలోనే ఏర్పాటు చేయాలని శనివారం ఉదయం గుంటూరు కలక్టరేట్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్కు రాష్ట్ర జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు నేతృత్వంలో ఇచ్చిన వినతిపత్రం లో పేర్కొన్నారు. సాగునీటి సంఘాల రాష్ట్ర సారధులు కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ మైనేని మురళీకృష్ణ (బాపట్ల జిల్లా), నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ యనమద్ది పుల్లయ్యచౌదరి (ఎన్.టి.ఆర్.జిల్లా), గుండపనేని శ్రీనివాసరావు (కృష్ణాజిల్లా), డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్లు కట్టా కోటయ్య (వినుకొండ), అంకాళ్ళ ప్రభుదాసు (సత్తెనపల్లి), తుమ్మల నాగేశ్వరరావు (ఏలూరు జిల్లా) తదితరులు పూర్తి వివరాలతో వినతిపత్రం సమర్పించారు.అనంతరం ఇదే విషయమై శనివారం సాయంత్రం గుంటూరు నుండి ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాల మేరకు విజయవాడలోనే కె.ఆర్.ఎం.బి. కార్యాలయం ఏర్పాటు చేయటానికి 2015లో ఇబ్రహీంపట్నంలో భవనాలను కూడా చూడటం జరిగిందని, 2019లో వై.సి.పి. ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా 2020 జూన్, ఆగస్టులలో కె.ఆర్.ఎం.బి. కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు వ్రాసిందని, దీనికి విరుద్ధంగా 2020 డిసెంబరులో కె.ఆర్.ఎం.బి. కార్యాలయాన్ని కృష్ణా బేసిన్ దాటి విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని గత వై.సి.పి. ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకోవటం చాలా దారణమన్నారు. ఈ నిర్ణయాన్ని పునః సమీక్షించి కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజి క్రింద ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 30 లక్షల ఎకరాల ఆయకట్టుకు అనువుగా కృష్ణానది ఒడ్డున రైలు, రోడ్డు, విమాన సౌకర్యం కలిగి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు, తెలంగాణ ప్రభుత్వ అధికారులు, ఆయకట్టుదారులు, నీటి సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను కె.ఆర్.ఎం.బి. దృష్టికి తీసుకు రావటానికి వీలుగా విజయవాడలోనే కె.ఆర్.ఎం.బి. కార్యాలయాన్ని ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీనిపై మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పందిస్తూ నీటి సంఘాల ప్రతినిధులు కోరిన విధంగా కె.ఆర్.ఎం.బి. కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోనే ఏర్పాటు చేయటానికి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి ఆంధ్రప్రదేశ్ రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పెమ్మసాని చంద్రశేఖరు నీటి సంఘాల రాష్ట్ర ప్రతినిధులు రైతు కండువా వేసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.

# లారీని స్టేషన్ కు తరలింపులో పాత్ర ఎవరిది

❍ ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాపీ ఇవ్వండి ❍ అనుమతులు ఉన్నా లారీని తీసుకురావడంలో మతలబు ఏమిటి?
❍ పోలీసుల తీరుపై మండిపాటు...❍ టిడిపి మండల అధ్యక్షులు రావి లక్ష్మీ నర్సారెడ్డి





**చేజర్ల జులై 20 (వార్తాప్రభ)** మండలంలోని మడపల్లి ఎర్రబల్లి సర్వే నెంబర్లో గల పట్టా పొలంలో యజమాని అగ్రిమెంట్ ఇచ్చాడని వాటికి సంబంధించిన అన్ని అనుమతులు ఉన్నాయని అందుకే జామాయిల్ కర్రని లోడు చేసుకొని కడప జిల్లా బద్వేల్ ఫ్యాక్టరీలో అన్లోడ్ చేస్తుండగా చేజర్ల పోలీసులు ఈ నెల 19వ తేదీన ఉదయంహాలోడ్ లారీని చేజర్ల పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి వచ్చారని ఇప్పటివరకు దానిపై ఎటువంటి కేసు నమోదు చేయకుండా లారీని వారి స్వాధీనంలో పెట్టుకుని ఉన్నారని ఇలా ఎందుకని చేస్తున్నారో చెప్పాలంటూ చేజర్ల మండల టిడిపి అధ్యక్షులు రావి లక్ష్మీనరసారెడ్డి పోలీసులను శనివారం అడగగా సరైన సమాధానం చెప్పడం లేదని లక్ష్మీ నరసారెడ్డి ఆరోపించారు.అక్రమం జరిగి ఉంటే తన లారీ మీద కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలని కోరారు.అయితే పోలీసులు సరైన సమాధానం తెలపడం లేదని ఆయన తెలిపారు.ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకుపోతున్నామని ఆయన పేర్కొన్నారు.స్థానిక పోలీసులను వివరణ అడిగితే ఎస్పై బందోబస్తులో ఉన్నారని ఆయన వచ్చిన తర్వాత వివరాలు తెలుపుతామని పోలీసు సిబ్బంది చెప్తున్నారని మండల టిడిపి అధ్యక్షులుహారావి లక్ష్మీ నర్సారెడ్డి ఆరోపించారు.ఆయన వెంట రావి కుటుంబ సభ్యులు టిడిపి ముఖ్య కార్యకర్తలు అరవ గోపిరెడ్డి రంపాటి ప్రసాద్ రావి కృష్ణారెడ్డి ఉన్నారు.

# " బోనాలు పండుగకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు"

**– చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు.**

**హైదరాబాద్/ఎల్బీనగర్,జులై 20 (వార్తాప్రభ):**బోనాల పండుగ సందర్భంగా చైతన్యపురి డివిజన్ పరిధిలో అమ్మవారి ఆలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ... ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని.బోనాల పండుగ సమయంలో అమ్మవారి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వల్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.మహిళా భక్తులు,పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.భక్తులు పోలీసు వారికి సహకరించాలని, సంతోషంగా బోనాల పండుగ జరుపుకోవాలని సీఐ ఆకాక్షించారు.




# సీఎం చంద్రబాబు ఆలోచన అద్భుత ప్రయోగం : ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

<u>సీఎం నివాసంలో జరిగిన టిడిపి పార్లమెంటరీ సమావేశం</u>

<u>ఢిల్లీ వేదికగా జగన్ దుష్ప్రచారాన్ని తిప్పికొడతాము</u>



**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి )** విజయవాడ కేంద్రంలోని వివిధ మంత్రితత్వ శాఖల నుంచి తెచ్చుకోవాల్సిన పలు పథకాలు, నిధుల ద్వారా రాష్ట్రానికి మరింత ప్రయోజనం చేకూర్చేందుకు ఎంపిలు, రాష్ట్ర మంత్రులు కలిసి పనిచేసే విధంగా రూపకల్పన చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన అద్భుత ప్రయోగమని..మంచి సత్ఫలితాలను ఇస్తుందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు.ఉండవల్లి లోని సీఎం చంద్రబాబు నాయుడు నివాసంలో శనివారం జరిగిన టిడిపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మీడియాతో మాట్లాడారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చే బాధ్యత టిడిపి ఎంపిలందరిపైన వుందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పథకాలు, నిధులు రాష్ట్రంలోని ఆ శాఖ మంత్రలతో సమన్వయం చేసుకుంటూ తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు చెప్పారు. గత ప్రభుత్వానికి పరిపాలన అనుభవం లేకపోవటం వల్ల కేంద్రం ఇచ్చిన ఏన్నో పథకాల నిధులు దుర్వినియోగం జరిగిందన్నారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కని జగన్ ఆ బాధలో రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని మాట్లాడటం విడ్డూరంగా వుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యమిస్తుందన్నారు. ఢిల్లీ వేదికగానే జగన్ దుష్ప్రచారాన్ని తిప్పికొడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో వైసిపి చేస్తున్న రాజకీయ హత్యల్లో టీడీపీ నేతలే బాధితులుగా వున్నారని ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు.

# గురు పౌర్ణమి సందర్భంగా అన్న సమారాధన



**హనుమాన్ జంక్షన్,జులై20(వార్తాప్రభ)** రేపు 21వ తారీకు ఆదివారం గురు పౌర్ణమి మహాపారవ దిన సందర్భంగా బాబావారి ఆలయంలో ఉదయం 8 గంటలకు బాబా వారికి పంచామృత అభిషేకం అష్టోత్తరం అమ్మవారికి శాకంబరి అలంకరణ కుంకుమ పూజ తేలప్రోలు భజన సమాజం వారిచే షిరిడి సాయి భజన ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించడం జరుగుతుంది. కావున బాబా వారి ఆలయానికి విచ్చేసి షిరిడి సాయిబాబా దర్శనం చేసుకుని, తీర్థ ప్రసాదాలను, అన్నప్రసాదాన్ని స్వీకరించాలని పాలకవర్గం కోరింది.

# విజ్ఞాన్ లో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

<u>అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు</u>



**పొదలకూరు జులై 20 (వార్తాప్రభ)** విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులను ఆహ్వానిస్తూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలను స్థానిక బోగోలు కృష్ణా రెడ్డి కళ్యాణ మండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిహెచ్ సి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, స్థానిక ఎస్సై డి రామకృష్ణ టిటిడి విజిలెన్స్ రిటైర్డ్ డిఎస్పి ప్రభాకర్ గౌడ్ హాజరయ్యారు.కాలేజీ కరస్పాండెంట్ మూలంరెడ్డి సుధాకర్ రెడ్డి యాజమాన్యం గువ్వల నారాయణ రెడ్డి ఎం.సుబ్బారెడ్డి బోగోలు భాస్కర్ రెడ్డి ఎన్.వి.రెడ్డి అన్నం సుబ్బారావు అకడమిక్ ఇన్చార్జ్ కృష్ణ వైస్ ప్రిన్సిపాల్ ఏ. చంద్రశేఖర్ హాజరై,జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ విద్యార్థులకు అవసరమైన సలహాలను అందిస్తూ తమ లక్ష్య సాధనకు కృషిచేసే విధంగా దిశానిర్దేశం చేయడంలో సీనియర్ విద్యార్థులు కీలకపాత్ర పోషించాలన్నారు.చదువుతో పాటు ఆటపాటలు క్రమ శిక్షణ తీపి జ్ఞాపకాలతో జీవితంలో ముందుకు పోవాలని సూచించారు.చదువు కంటే సంస్కారం ముఖ్యమని తల్లిదండ్రులు చదువుల విషయంలో అబ్బాయిలు అమ్మాయిలంటూ వ్యత్యాసం చూపకూడదన్నారు.బాల్యం నుంచి ఉద్యోగం వచ్చే వరకు వివిధ వ్యక్తుల,ప్రముఖుల కెరీర్ లో ముఖ్య సంఘటనలు విద్యార్థులతో పంచుకున్నారు. అందరిని గురించి అందరూ తెలుసుకోవడానికి ఈ ఫ్రెషర్స్ డే వేడుకలు ఉపయోగపడతాయన్నారు.అనంతరం మండల స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు స్వర్గీయ మూలంరెడ్డి.శేషారెడ్డి జ్ఞాపకార్థం జ్ఞాపికలను నగదు బహుమతులను అందజేశారు. అలాగే తెలుగులో 99 మార్కులు వచ్చిన విద్యార్థులకు తెలుగు ప్రతిభా పురస్కారంతోపాటు బహు మతులను అందజేశారు. విద్యార్థులు మంచి మానవీయ సంబంధాలకు ఇందోక పరిచయక వేదిక అని అన్నారు.విద్యార్థుల మధ్య సహృద్భావ వాతావరణం పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. మధ్యాహ్నం నుంచి విద్యార్థులు పలు సినీ గీతాలకు జానపద గేయాలకు వేసిన డాన్సులు స్కిట్లు అందర్నీ అల్లరించాయి.ఈ కార్యక్రమం అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రక్షణ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు

❍ ఇండియన్ ఎయిర్ పోర్స్ అధికారి ఎన్ సందీప్




**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రక్షణ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఇండియన్ ఎయిర్ఫోర్స్ అధికారి ఎన్ సందిప్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్సీసీ విభాగం ఆధ్వర్యంలో రక్షణ రంగంలో ఉపాధి అవకాశాలు అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ సందిప్ మాట్లాడుతూ త్రివిధ దళాల్లో పని చేసేందుకు వివిధ క్యాడర్లలో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఒకవైపు ఉపాధితో పాటుగా దేశానికి సేవ చేసే అవకాశాలను పొందవచ్చన్నారు. ఆ క్రమంలో ఇటీవల అగ్నివీర్తల్ (ఆర్మీ), అగ్నివీర్జల్ (నేవీ), అగ్నివీర్వాయు (ఎయిర్ఫోర్స్) విభాగాల పేరుతో ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధితో పాటుగా దేశానికి సేవచేసే అవకాశం ఈ త్రివిధ దళాల ద్వారా పొందవచ్చన్నారు. వాటిపై విద్యార్థుల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆ దిశగా విద్యార్థులు తమ అర్హతలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వెలగా జోషి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, ఎన్సీసీ ఆఫీసర్ కేపీటీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# " సీఎం రేవంత్ హయాంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది"

**– వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.**



**హైదరాబాద్/ఎల్బీనగర్,జులై 20 (వార్తాప్రభ):** సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ అన్ని రంగాల్లో పరుగులు పెడుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమనగల్ మండల పరిధిలోగల మేడిగడ్డ తండ సమీపంలోని వెంచర్‌లో ఎంపీడీవో మాధురి, సీఐ ప్రమోద్ కుమార్, ఎస్సై వెంకటేష్, ఫారెస్ట్ అధికారి దేవేందర్‌లతో కలిసి ఎమ్మెల్యే చెట్లను నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు.నియోజకవర్గంలో ఈ ఏడాది 66 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని ,మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతి మొక్క సంరక్షించేలా చర్యలు తీసుకుంటామని, మొక్కలు నాటే కార్యక్రమం మన భవిష్యత్తుకు తరాలకు ఉపయోగపడుతుందని అన్నారు.ఎక్కడ ఖాళీ స్థలం ఉన్నా, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా అన్ని స్థలాలలో అలాగే రహదారులకు ఇరువైపులా అన్నిచోట్ల మొక్కలు నాటి సంరక్షణ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో. కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు మెకానిక్ బాబా. మాజీ ఎంపీపీఅనిత విజయ్. ఆమనగల్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వనువుల మానయ్య. మండలకాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు జగన్.కృష్ణా నాయక్.కాలేమల్లయ్య.పర్వతాలు.రాఘవేందర్.ఎంగలి ప్రసాద్.ఖాదర్.శ్రీనివాస్ రెడ్డి.మైసయ్య.సురేష్. తదితరులు పాల్గొన్నారు



# " దిల్ సుఖ్ నగర్ సాయిబాబా మందిరంలో ఘనంగా లక్ష పువ్వులతో పుష్పార్చన"

**– కలశ పూజ,పుష్పార్చనలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు..**

**– ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆలయమాజీ చైర్మన్ గుండ మల్లయ్య.**



**హైదరాబాద్/ఎల్బీనగర్,జులై 20 (వార్తప్రభ)**: దిల్ షుఖ్ నగర్ సాయిబాబా మందిరంలో 3రోజులపాటు నిర్వహించనున్న గురు పౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు శనివారం కలశపూజ, లక్ష పుష్పార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ పూజలో ఆలయ మాజీ చైర్మన్ గుండ మల్లయ్య దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3రోజులపాటు జరిగే గురుపౌర్ణమి వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, సాయినాథుడిని దర్శించుకుని బాబా అనుగ్రహం పొందాలని కోరారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని అన్నారు. శనివారం రోజు నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని, అదేవిదంగా రెండవ రోజు అయిన ఆదివారం గురు పౌర్ణమి వేడుకలకు సెలవు దినం కావడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని భక్తులు లక్ష మంది వరకు బాబాను దర్శించుకునే అవకాశం ఉందన్న అంచనతో పోలీస్ ప్రొటెక్షన్ ఏర్పాటు చేశామని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగదని చెప్పుకొచ్చారు. అన్ని విభాగాల వారు గురు పౌర్ణమి రోజు చక్కగా సహకరించాలని కోరారు.



# ఎల్బీనగర్లో అక్రమ కట్టడాల కూల్చివేత

❍ ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలి.
❍ ఇకనుండి అక్రమ కట్టడాలపై ఉక్కు పాదం.
❍ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్.



**హైదరాబాద్ / ఎల్బీనగర్,జూలై 20(వార్తప్రభ):** జిహెచ్ఎంసి ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో అక్రమ నిర్మాణాలపై జోనల్ కమిషనర్ హేమంత్ ఐఏఎస్, ఉక్కు పాదం మోపారు. శనివారం పోలీసుల రక్షణ మధ్య బి ఎన్.రెడ్డినగర్ జంక్షన్-3 వద్ద జోనల్ కమిషనర్ ఆదేశాలతో ఏసిపి పావని ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. మరిన్ని అక్రమ కట్టడాల కూల్చివేతలు కొనసాగనున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనలకు అనుమతులు తీసుకొని కట్టడాలు చేపట్టాలని, అక్రమ కట్టడాలను ఉపేక్షించేది లేదని జెడ్సీ తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఏసీపీలు, ఎస్ ఓ లు,డిఈ/ఏఈ లు మరియు ఇతర సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.




# వికాస్ పాఠశాలలో ఫ్రూట్స్ డే కార్యక్రమం



**తొర్రూర్ జూలై 20(వార్తా ప్రభ)**డివిజన్ కేంద్రం లో వికాస్ పాఠశాలలో శనివారం ఫ్రూట్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు ఆపిల్ అరటి , జామ, కివి, డ్రాగన్, అవకాడో, ద్రాక్ష , నారింజ పైనాపిల్ దానిమ్మ పూచ్చకాయ అనేక రకాల పండ్లను తీసుకొని వచ్చి అందంగా అలంకరించి ప్రదర్శిం చడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకి ఫ్రూట్స్ తినడం వల్ల పిల్లలకు ఎంతో ఆరోగ్యం ను ఇస్తాయ న్నారు. వాటి లో విటమిన్ ల ఉపయోగాన్ని వివరించడం జరిగింది. వాతా వరణ మార్పు ల వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను తీర్చ డానికి విటమిన్ సి ఎంతో అవ సరమని ఇది పండ్ల ద్వారా సహజంగా లభిస్తుందని కావున అధికంగా పండ్లు తీసుకొనిమన ఆరోగ్యాన్ని కాపాడుకోవా లని తెలిపారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయు లు వేణుమాధవ్, డైరెక్టర్స్ కెవి రెడ్డి, శ్రీలత , ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అధ్వానంగా మారిన మాముడూరు ప్రధాన రహదారి



**చేజర్ల జులై 20 వార్తాప్రభ)** సంగం చేజర్ల ప్రధాన రహదారి అయిన మామిడూరు గ్రామపంచాయతీ సచివాలయం దగ్గర అద్వానంగా ఆర్ అండ్ బి రోడ్డు ఉండటం వలన 24వ తేదీ సైక్లోన్ ఉండటంతో ఆ ప్రధాన రహదారిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున జిల్లా ఆర్ అండ్ బి అధికారులు చొరవ తీసుకొని బురదమయమైన ప్రధాన రహదారిని గుంతల మయం అయిన ఆ రహదారి కి మరమ్మత్తులు చేపట్టి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని మాముడూరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ జిల్లా ఆర్ అండ్ బి అధికారులకు విన్నవిస్తున్నారు.ఈ సమస్యపై జిల్లా సంబంధిత అధికారులు దృష్టి కేంద్రీకరించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కుంకు బాలయ్య నాయుడు బిజెపి జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు అల్లంపాటి నారాయణరెడ్డి యానాదిరెడ్డి లు డిమాండ్ చేస్తున్నారు



# బోయిన్ పల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి కూకట్ పల్లికే దక్కాలి: మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి.



**కూకట్ పల్లి, జులై 20 (వార్తాప్రభ):**బోయిన్ పల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి విషయంలో కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు మద్దత్తు ఇవ్వాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ను కలిసి కూకట్ పల్లి ఏ.బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి కోరారు. సానుకూలంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ స్పందించారు. బోయిన్ పల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి సంబంధించి దశాబ్దాలుగా కూకట్ పల్లి కి అన్యాయం జరుగుతుందని,త్వరలోనే కూకట్ పల్లి నియోజకవర్గ ఇంఛార్జి బండి రమేష్ ని, మైనంపల్లి హన్మంతరావు ని, ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి ని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్తాను అని యుగంధర్ రెడ్డి తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనం జయప్రదం చేయండి

● ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం



**ఎమ్మిగనూరు,జూలై 20 (వార్తాప్రభ) :** జూలై 29 30 31 తేదీలలో మదనప ల్లెలో జరుగుబోతున్న ఆంధ్రప్రదేశ్ ఏపీ రైతు సంఘం(ఏఐకేఎస్) రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనాన్నికి పెద్ద ఎత్తున రైతులు తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం (ఏఐకేఎస్) ఎమ్మిగనూరు నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు మాలిక్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.జగన్నాథం పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభానికి మూల కారణాలను విశ్లేషించి రైతులను రుణగ్రస్తుల కాకుండా కాపాడాలని, రైతుల ఆత్మహత్యలను నివారించాలని వారు తెలిపారు. రైతుల పండించిన అన్ని పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని,వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 3 వ్యవసాయ చట్టాలను నిలుపుదల చేయాలని రైతులకు పండించిన పంటలకు వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులపై 50% అదనంగా కలిపి మద్దతు ధర నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.పంపన్నగౌడ్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో కూడా నీటిపారుదల ప్రాజెక్టులు ఒకటి కూడా పూర్తి చేయలేదని, రైతుల పరిస్థితి చాలా అధ్వానంగా మారి వ్యవసాయం అంటే రైతులు సుఖంగా లేరని వారు తెలిపారు. ప్రతి సంవత్సరం కరువు వల్ల పంటలు పండగ రైతులు వేరే ప్రాంతాలకు వలస వెళుతున్నారని ఇంత జరుగుతున్న ఏ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఈ తరుణంలో రైతన్న సమస్యలు సాధనకై మదనపల్లెలో జూలై 29,30, 31 తేదీలలో జరగబోయే రైతు సంఘం రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి బీటీ.చిన్నాన్న,తాలూకా కార్యదర్శి శాంతప్ప,రైతు సంఘం నాయకులు విరుపాక్షి నాయుడు, గిడ్డయ్య,నాగప్ప, ఇస్మాయిల్,జయరాం, హనుమంతు,శ్రీరాములు, వీరేష,ఈనోస్,నరసప్ప, తిమ్మప్ప,మల్లేష్, నరసింహులు,రవి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి -ఎమ్మెల్యే యార్లగడ్డ

● యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టండి



**గన్నవరం,జూలై 20 (వార్తాప్రభ) :** రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నియోజకవర్గం లో అంటువ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని వీటి నివారణకు గ్రామాల్లో యుద్ధప్రతిపదికన పారిశుధ్ద్య పనులు చేపట్టాలని గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులు ఆదేశించారు. శనివారం ఆయన తన నివాసం నుండి గన్నవరం నియోజకవర్గంలోని 4 మండలాల ఎమ్మార్వోలు ఎండిఓలు, వ్యవసాయ శాఖ అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గంలో భారీ వర్షాల ప్రభావం పై గ్రామాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రతిపదికన సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీల్లో పూడిక తీసి మురుగునీరు నిలవకుండా చూడాలన్నారు. డ్రైనేజీల పూడిక తీత పనులకు నిధుల కొరత ఉంటే ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే డ్రైనేజి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, దోమల నివారణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పంచాయతీల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో బ్లీచింగ్ చల్లాలన్నారు. ఆదివారం కూడా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అధికారుల అంచనాల మేరకు వరద ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వరదలు సంభవిస్తే ఆస్తి, ప్రాణ, పశు నష్టాన్ని నివారించేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి భారీ వర్షాల నుండి పంటలను కాపాడుకునే లా, పంట నష్ట నివారణకు రైతులకు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. ఉద్యాన శాఖ అధికారులు కూరగాయలు సాగు చేసే రైతులకు పండ్ల తోటల రైతులకు తగు సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఆదేశించారు. కాలువల్లో తూటు కాడ పెరిగిపోయి నీటిపారుదలకు ఆటంకం కలిగిస్తుందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా ఈ సమస్యపై కలెక్టర్ తో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని యార్లగడ్డ హామీ ఇచ్చారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

# జర్నలిస్టులపై రాజ్యసభ ఎంపీ విజయసాయి రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసన




**నూజివీడు,జూలై 20 (వార్తాప్రభ) :** మీడియా యాజమాన్యాల పై, జర్నలిస్టులపై రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసన తెలిపిన నూజివీడు నియోజకవర్గ జర్నలిస్టులు.. జర్నలిస్టుల నిరసనకు సంఘీభావం తెలిపిన టిడిపి, జనసేన, కాంగ్రెస్ పార్టీల నాయకులు.. విజయసాయి రెడ్డి తక్షణం జర్నలిస్టులకు మీడియా యాజమాన్యాలకు క్షమాపణ చెప్పాలని, అలాగే ఆయనపై వచ్చిన ఆరోపణలను నిజం కాదని నిరూపించుకోవాలి తప్ప అసభ్య పదజాలంతో మీడియా యాజమాన్యాలను, జర్నలిస్టులను దూషించడం హేయమైన చర్య అని తక్షణం విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దుచేసి తగిన చర్యలు తీసుకోవాలని అలాగే విజయసాయి రెడ్డి జర్నలిస్టులకు, మీడియా యాజమాన్యాలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు నూతక్కి వేణు, జనసేన నాయకులు తోట వెంకట్రావు, బొబ్బిలి శ్రీకాంత్, సూరిశెట్టి శివ, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గొల్లా పవన్

# మమతల పందిరి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నార్థులకు అన్న ప్రసాదం వితరణ...





**హనుమాన్ జంక్షన్,జూలై 20 (వార్తాప్రభ) :** మమతల పందిరి సేవా సమితి ఆధ్వర్యంలో 99వ సేవా కార్యక్రమంలో భాగంగా హనుమాన్ జంక్షన్ పరిసర ప్రాంతాలలో భారీ వర్షం వలన మురికీవాడల్లో నివసించేవారు ఆహారానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు మురికి వాడల్లో నివసిస్తున్న 100 కుటుంబాలకు గుమ్మడి చిట్టెమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తె పరుచూరి రాజేశ్వరి సహకారంతో ఆహారాన్ని, వికలాంగులకు వాకర్స్, వాకింగ్ స్టిక్స్,అందించామని సమితి వ్యవస్థాపక అధ్యక్షులు లంక రమేష్ తెలియజేశారు. మమతల పందిరి సేవా సమితి ఆధ్వర్యంలో ఇవాళ 99 వ సేవా కార్యక్రమాన్ని హనుమాన్ జంక్షన్ పరిసర మురికి వాడల్లో నిర్వహించామని తెలిపారు. త్వరలో నిర్వహించే 100 శత సేవా కార్యక్రమాలలో నిరుపేద యువతి యువకులకు నూతన వస్త్ర బహుకరణ, మహిళలకు స్వయం ఉపాధి కోసం శిక్షణ నిమిత్తం కుట్టు మిషన్ కేంద్రం ఏర్పాటు , అంగనవాడి పిల్లలకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు లంక రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరుచూరి రామకృష్ణ, చీకటి జయరామ్, లంక జ్ఞాన ప్రసన్న, పూసపాటి జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి...

● రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి..



**ఏలూరు/నూజివీడు,జూలై 20 (వార్తాప్రభ) :** భారీ వర్షాల నేపధ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్ధసారధి ఆదేశించారు. భారీ వర్షా కారణంగా నియోజకవర్గంలో ముంపుకు గురైన ప్రాంతాల వివరాలు చేపడుతున్న చర్యలపై ప్రభుత్వ అధికారులతో శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మంత్రివర్యులు కొలుసు పార్ధసారధి సమీక్షించారు. ఈ సమీక్షలో పాల్గొన్న రెవెన్యూ డివిజనల్ అధికారి భవాని శంకరి ఇరిగేషన్ డివిజనల్ ఇంజనీరు సత్యనారాయణ లతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్బంగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి మాట్లాడుతూ ముసునూరు, చాట్రాయి నూజివీడు మండలాల పరిధిలోని వాగులు, పంట కాలువల పరిస్థితిపై ఆరాతీశారు. భారీ వర్షాల కారణంగా పంట నష్టం ఎంతమేరకు ఉండవచ్చునని అధికారులనుండి సమాచారం తెలుసుకున్నారు. రోడ్ల పై భారీ వృక్షాలు విరిగి పడి ఉండటం గమనించిన మంత్రివర్యులు అవి వెంటనే తొలగించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే భారీ వర్షాలు కారణంగా కలుషిత నీటి ద్వారా ముఖ్యంగా అతిసార వ్యాధి సోకుతుందని మరియు డెంగ్యూ మలేరియా జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలియజేస్తూ దానిపై ప్రత్యేక శ్రద్ధ చూపి జిల్లా వైద్యాధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ముందస్తుగా మందుల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాలు కారణంగా విద్యుత్ స్తంభాలు అకస్మాత్తుగా పడటం వలన విద్యుత్ వైర్లు తెగి పడటంతో ప్రాణనష్టం ఎక్కువ ఉంటుందని వాటి బారిన పడకుండా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలను కాపాడడానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే భారీ వర్షాల వలన పశువుల ప్రాణనష్టం కలుగకుండా నివారించుటకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అధికారులకు తెలిపారు ముఖ్యంగా వర్షాల ద్వారా గొర్రెలు, మేకలు, బర్రెలు, అనేక రోగాలకు గురవుతాయని వాటిని నివారించడానికగి అందుకు తగిన జాగ్రత్తలు తీసుకొని రైతులను కాపాడాలని మంత్రివర్యులు అధికారులకు సూచించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ వర్షాన్ని తట్టుకొనే శక్తి మన చెరువులకు ఉందా అని ప్రశ్నించగా ఇంకా రెండు రోజులు కురిసినా వర్షాన్ని తట్టుకునే సామర్థ్యం మన నియోజకవర్గములో ఉన్న చెరువులకు ఉందని తెలియజేస్తూ 4 రోజుల వర్షాల వల్ల పూర్తిగా చెరువులు నిండుతాయని సంబంధిత అధికారులు మంత్రికి తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో అధికారులు స్పందిస్తూ ప్రస్తుతానికి ఎటువంటి ఆస్తి నష్టం, పంట నష్టం గాని జరగలేదని తెలియజేస్తూ రానున్న రెండు రోజుల్లో కూడా ఎటువంటి నష్టం కాని ఎలాంటి ఇబ్బందులు ప్రజలకు కలుగకుండా ముందస్తు చర్యలు చేపడతామని అధికారులు మంత్రివర్యులకు తెలియజేసారు. దీనిపై రాష్ట్ర మంత్రి పార్ధసారధి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారం తమకు తెలియజేయాలని దానిని బట్టి తక్షణ చర్యలు చేపడతామన్నారు. సమీక్షా సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వై. భవాని శంకరి, ఇరిగేషన్ డివిజనల్ అధికారి సత్యనారాయణ, అగ్రికల్చర్ అధికారులు, విద్యుత్ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బాలికల ప్రిమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలి...

● ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప



**ఎమ్మిగనూరు,జూలై 20 (వార్తాప్రభ) :** బీసీ బాలికల ప్రీ మెట్రిక్ భాషలకు హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని స్థానిక సుందరయ్య భవన్ నందు ఎస్ఎఫ్ఐ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ బీసీ ప్రిమెట్రిక్ హాస్టలుకు సొంతభవనలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నాము అని పత్రిక ప్రకటనలు ఇవ్వటం తప్పితే వాటి అమలు చేయటంలో విఫలమైందన్నారు. అందులో సంక్షేమ హాస్టళ్లలో చదివే పేద బడుగు బలహీనర్గాలకు చెందిన విద్యార్థుల పరిస్థితి మరి దారుణంగా ఉందన్నారు. కర్నూల్ జిల్లా అభివృద్ధిలో వెనకబడిన ప్రాంతం నిరంతరం ప్రజలు దూర ప్రాంతాలకు వలసలు వెళ్తుంటారని. అలా వలసలకు వెళ్ళే క్రమంలో తమ పిల్లలను సంక్షేమ హాస్టల్లో వదిలితే వారి భవిష్యత్ బాగుంటుందని బావించిస్తుంటారు. జిల్లాలో బాలికల హాస్టల్ లో చాలా ప్రాంతాలలో లేకపోవటంతో ఎమ్మిగనూరులోని బీసీ ప్రిమెంట్రిక్ హాస్టల్ తమ పిల్లలను ఈ హాస్టల్ లో చేర్పించాలని జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల నుండి తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్లో వదిలి ఎమ్మిగనూరుకి వస్తున్నారు కానీ ఈ హాస్టల్ ప్రైవేట్ భవనం కావటం వల్ల ఈ సంవత్సరం ఈహాస్టల్ లో 450 విద్యార్థులు ఉన్నారు. అంతకు మించి ఆ భవనంలో విద్యార్థులు సదుపాయాలు అందించలేము అని హాస్టల్ వార్డన్ హరిత దేవి మా దృష్టికి తీసుకొని వచ్చిందన్నారు. ఎస్ఎఫ్ఐ గా మేము హాస్టల్ సర్వే చేసినప్పుడు హాస్టల్ కేవలం 11 గదులు ఒక్కొక్క గదికి 40 మంది విద్యార్థినిలు వుంటున్నారని. వీరందరికీ కేవలం 10 బాత్ రూములు, 10 టాయిలెట్లు ఉన్నాయనారు. అలాగే నిద్ర పోయే టైంలో విద్యార్థులు వారి ట్రాంక్ పెట్టేలను ఒకదనిమీద ఒకటిపెట్టి నిద్రపోవాల్సిన పరిస్థితి ఉంది ఇలాంటి పరిస్థితులు ఇక్కడ ఉన్నా కూడ ఈ సంవత్సరం ఇంకా 380 మంది విద్యార్థులకు సీట్లు అలాట్మెంట్ కాకపోవటంతో వారి భవిష్యత్ ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. దీనంతటికీ కారణం జిల్లా స్థాయి అధికారుల లోపమేనాని జిల్లాలోని అన్ని ప్రాంతాలలో సంక్షేమ హాస్టల్లు ఏర్పాటు చేస్తే ఎక్కడిక్కడే విద్యార్థులు తమ చదువులను కొనసాగించేవారన్నారు. ఇప్పుడు ఈ హాస్టల్ లో సీట్లు అలాట్మెంట్ కాని విద్యార్థులు ఇప్పటికే తమ చదువును మధ్యలోనే ఆపివేసి తల్లిదండ్రులతో కలసి దూర ప్రాంతాలకు వసలకు వెళ్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో హాస్టళ్లు నిర్మించాలని అలాగే ఎమ్మిగనూరులో గతంలో ఉన్న ఎన్టీఆర్ కాలనిలో ఎస్సీ, బీసీ ప్రిమెట్టిక్ హాస్టల్లు పాత భావనలు ఉన్నా చోట ఇప్పుడు క్రొత్త ఎస్సీ, బీసీ, ప్రిమెట్రిక్ హాస్టల్లకు సొంతభవనాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విజయ్, నాయకులు అగ్గి రాముడు, అభి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన జాతీయ విద్యా విధానంపై ఆగస్టులో విజయవాడలో జాతీయ సదస్సు

● ముఖ్యఅతిథిగా హాజరుకానున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి



● రెండు రోజులపాటు సదస్సు నిర్వహణ

**విజయవాడ,జూలై 20 (వార్తాప్రభ) :** నూతన జాతీయ విద్యా విధానం అమలులో ఎదురయ్యే సవాళ్లపై ఆగస్టు 3,4 తేదీల్లో రెండు రోజులు పాటు జాతీయ సదస్సును విజయవాడలో నిర్వహిస్తున్నట్లు స్పా కళాశాల సంచాలకులు ఆచార్య కొండా రమేష్ తెలియజేశారు .ఈ సదస్సు జరుగుతున్న సందర్భంగా స్పా కాలేజీలో ఈరోజు బ్రోచర్ను ఆయన ఆవిష్కరించారు .ఈ సందర్భంగా కొండ రమేష్ మాట్లాడుతూ అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ, ప్రణాళిక రూప శిల్ప కళాశాల (స్పా) సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే సదస్సుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. సిద్ధార్ధ అకాడమీ విద్యా విష్యక సలహాదారు వినయ్ కుమార్ గౌరవ అతిథిగా హాజరవుతున్నారని వివరించారు. అఖిల భారత రాష్ట్రీయ సైక్షిక్ మహాసంగ్ జాతీయ సంయుక్త నిర్వహణ కార్యదర్శి గుంత లక్ష్మణ్ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. సదస్సు సమన్వయకర్తగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వాణిజ్య శాస్త్ర మేనేజ్మెంట్ విభాగం డీన్ ఆచార్య ఆర్ శివరామ ప్రసాద్ నిర్వహణ కార్యదర్శిగా, ఎస్ఆర్ఆర్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బాలసుబ్రమణ్యం వ్యవహరిస్తారని వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఈ సదస్సులో పాల్గొంటారని కొండా రమేష్ తెలియజేశారు .జాతీయ నూతన విద్యా విధానం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆశించిన లక్ష్యాలు, అమలులో ఎదురయ్యే సవాళ్లు, వాటికి పరిష్కారాలు వంటి అంశాలను ఈ సదస్సులో చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వైవిరామిరెడ్డి, డాక్టర్ బాలసుబ్రమణ్యం, డాక్టర్ బాలకృష్ణ ,సిహెచ్ కార్తీక్, ఆర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు

# డాక్టర్ కొల్లూరి చిన్నాకు అబ్దుల్ కలాం ప్రతిభా జాతీయ సేవ రత్న అవార్డు



**పెడన,జూలై 20 (వార్తాప్రభ) :** పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు అఖిలభారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) కు మరొక అరుదైన గౌరవం లభించింది. భారత దేశ మాజీ రాష్ట్రపతి ఏ పీ జే అబ్దుల్ కలాం ప్రతిభ జాతీయ సేవ రత్న అవార్డుకు ఎంపికయ్యారు.డా. కొల్లూరి చిన్నా నాలుగు దశాబ్దాలుగా పెడన పట్టణ పరిసర ప్రాంత పేద ప్రజలకు అందించిన నిస్వార్థ సేవలను గుర్తించిన విశాఖపట్నం కి చెందిన ప్రతిభ క్రీడ అండ్ సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ అవార్డ్స్ సెలెక్ట్ కమిటీ వారు ఈ అవార్డుకు ఎంపీ చేశారు. ఆగస్టు 11న విశాఖ జిల్లా పౌర గ్రంథాలయంలో 24వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో డా. కొల్లూరి ఏ పీ జే అబ్దుల్ కలాం ప్రతిభ జాతీయ సేవ రత్న అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం పెడన మండల ఆర్యవైశ్య సంఘం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం వాసవి క్లబ్ వాసవి సేవాదళ్ పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి ప్రతినిధులు పుర ప్రముఖులు ఏ పీ జే అబ్దుల్ కలాం ప్రతిభ జాతీయ సేవ రత్న అవార్డు గ్రహీత డా. కొల్లూరి చిన్నాను ప్రత్యేకంగా అభినందించారు.

# జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి..!



**కోడూరు, జూలై 20 (వార్తాప్రభ) :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు జనసైనికులు వేగవంతం చేయాలని కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య పిలుపునిచ్చారు. శనివారం కోడూరు ప్రధాన సెంటర్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని స్థానిక పార్టీ నేతలతో కలిపి చేపట్టారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 28 వరకు కొనసాగుతుందని, ప్రతి ఒక్క జనసేన కార్యకర్తతో సభ్యత నమోదు చేపించి అత్యవసర పరిస్థితుల్లో పార్టీ వారికి అండగా ఉండే అవకాశాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోట రాంబాబు, పూత బోయిన కరుణ్ కుమార్, పూత బోయిన సీతారత్న సాయిబాబు, అప్పికట్ల వినోద్, కడవకొల్లు మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేద్దాం... ప్రాణదాతలు అవుదాం...



**కోడూరు, జూలై 20 (వార్తాప్రభ) :** ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఉపయోగపడే విధంగా రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని లెజెండ్స్ సోషల్ సర్వీస్ అధినేత పూతబోయిన అయ్యప్ప స్వామి కోరారు. శనివారం కోడూరు రామకృష్ణ థియేటర్ ప్రాంగణంలో (మసీద్ సెంటర్) మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కోడూరు ఫర్టిలైజర్స్ అండ్ ఫస్ట్ సైడ్స్ సంఘ అధ్యక్షులు పూతబోయిన వెంకట రామారావు ప్రారంభించారు. మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు రక్తనమోనాలను సేకరించారు. అన్నం యోగానంద్, మేడూరి చంద్రశేఖర్, బండే జయ కిషోర్, బడే నాని, లెజెండ్స్ సోషల్ సర్వీస్ టీం సభ్యులు, రక్తదాతలు పాల్గొన్నారు.

# పశు వైద్యశాలకు అనారోగ్యం




**విస్సన్నపేట,జూలై 20 (వార్తాప్రభ) :** స్థానిక మండల పురాతన పెంకుటిల్లు పశు వైద్యశాల వర్షపు నీరుతో నిండిపోవడంతో ఇటు పశువుల యజమానులు అటు ఉద్యోగులు కూడా భయభ్రాంతుల అవుతున్నట్లు సర్వత్రా అనుకుంటున్నారు. అనారోగ్య లక్షణాలు కలిగిన పశు వైద్యశాలకు అధికారుల వైద్యం చేయవలసిందిగా పలు విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి .వివరాలు లోకి వెళితే సుమారు 2800 గేదెలు ఆవులు వెయ్యికి పైగా మేకలు గొర్రెలు వేలాది కోళ్లు వైద్య సేవలు పొందుతున్న మండల కేంద్రంలో మౌలిక వసతులు లేక వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తోంది.వర్షం నీటితో విద్యుత్తు లైన్ లు తడిసిపోవడంతో ప్రాణాలను సైతం గుప్పెట్లో పెట్టుకొని పశువుల యజమానులు వైద్య సేవలు పొందుతున్నారు. అత్యధిక పాల దిగుబడిని అందించే ప్రాంతం కమటూరు కావడంతో దగ్గరలో ఉన్న సచివాలయం 2 నందు కొంత భాగాన్ని కేటాయించవలసిందిగా పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జెండాలు వేరైనా అభివృద్దే ఎజెండాగా పనిచేద్దా-ఎమ్మెల్యే కొలికపూడి



**తిరువూరు,జూలై 20 (వార్తాప్రభ) :** జెండా లు వేరైనా అభివృద్దే ఎజెండాగా పనిచేద్దామని స్థానిక శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు.శనివారం తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ గత్తం కస్తూరి భాయి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలక పక్షం వైసిపీ,ప్రతిపక్ష టీడీపీ సభ్యులు తిరువూరు పట్టణ అభివృద్ధికి ఏర్పడుతున్న ఆటంకాలు, నిధుల కొరత పై సమీక్ష జరిపారు.ఇరు పక్షాల సభ్యులు అరోప, ప్రత్యారోపణల తో వాడీవేడిగా చర్చ కొనసాగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ రాజకియాలకు పోకుండా పట్టణంలో తిష్ట వేసిన సమస్యల పరిష్కారం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.ఒక్క రోజులో ఏ సమస్య పరిష్కారం కాదన్నారు. ప్రణాళిక బద్దంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందటం ప్రజా ప్రతినిధులు గా మనందరి భాధ్యత అని కౌన్సిలర్లకు సూచించారు.ఈసమావేశంలో టీడీపీ సభ్యులు ధైర్యంగా సమస్యలు ప్రస్తావించే అవకాశం ఇచ్చారనీ, వైసిపీ సభ్యులు మాత్రం ఆవేశంలో వాస్తవాలు మాట్లాడారని అన్నారు.పార్టీ ఏదైనా వాస్తవాలు మాట్లాడు కోవాలే కానీ జండాలు పేరుతో విమర్శలు చేసుకోవటం సరికాదన్నారు.ముఖ్యం గా డ్రైనేజీ సమస్య, రహదారులు, విద్యుత్,మంచి నీరు, పారిశుద్ధ్యం, రహదారి ఆక్రమణలు,పబ్లిక్ టాయిలెట్స్, ట్రాఫిక్ తదితర సమస్యల పై ఇరుపక్షాల సభ్యులు తన దృష్టికి తీసుకురావటం సంతోషంగా ఉందన్నా రు. ఏ సమస్య అయినా ప్రాథమిక దశలోనే పరిష్కరించుకోవాలని,లేదంటే ఒక సమస్య మరికొన్ని సమస్యలకు కారణం అవుతుందన్నారు.ఉదాహరణ కు రోడ్డుపై గుంతల్ని ముందే గమనించి కూడా కనీసం ప్యాచ్ వర్క్ చేయకుంటే వర్షం వస్తే ఆగుంతలో మురుగు నీరు నిల్వ ఉంటుందని, తద్వారా దోమలు వ్యాప్తి చెందుతాయని,వాటి వల్ల వ్యాధు లు ప్రభలి జనం రోగాలబారిన పడతారన్నారు.దీంతో సమస్య తీవ్రత పెరిగి ప్రజాప్రతినిధులు, అధికారులు జనం చేత చివాట్లు తినే పరిస్థితి వస్తుందని ఎమ్మెల్యే అన్నారు.తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఒకటైన ఏ.కొండూరు మండలాన్ని దత్తత తీసుకుంటున్నానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సమావేశంలో ప్రకటించారు.ఈ మండలంలో వెనుకబడిన వర్గాలు ఎక్కువగా ఉండడం, రైతులు వ్యవసాయంపై ఆధారపడడం దత్తత తీసుకోవడానికి కారణంగా చెప్పుకొచ్చారు.రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులతో తిరువూరు పట్టణ, నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచే కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మొత్తం 20 మంది కౌన్సిలర్లు, మండలా ల్లోని సర్పంచ్ లు, ఎంపిటిసిలు సభ్యులు,జెడ్పిటిసి లు అందరం రెండు బస్ లలో మన ఊరు, తిరువూరు పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబును, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, వివిధ శాఖల మంత్రులను కలిసి నిధులు మంజూరుకు కృషి చేద్దామని తెలియజేశారు.ఈసమావేశంలో కమీషనర్ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

# "ఐ లవ్ గుడివాడ" ప్రభుత్వంతో ప్రజల భాగస్వామ్యం.. అవుతుంది గుడివాడ అభివృద్ధిమయం: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

● ఐ లవ్ గుడివాడ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము. ●మున్సిపల్, శానిటేషన్ సిబ్బంది తో క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడ పై ర్యాలీ.. ●ప్లకార్డులు పట్టుకుని పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఎన్డీఏ పార్టీల నేతలు, యువత..





**గుడివాడ,జూలై 20 (వార్తాప్రభ) :** పరిశుభ్రమైన గుడివాడ రూపకల్పనలో ప్రభుత్వం చేస్తున్న కృషిలో..ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు. మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బందితో కలిసి 'క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడపై' అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎన్డీఏ పార్టీల నేతలు, యువత కలిసి ఐ లవ్ గుడివాడ ప్లకార్డులు పట్టుకొని పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ క్రమంలో పరిసరాల పరిశుభ్రతపై రోడ్ల వెంబడి టీ స్టాల్స్, తోపుడు బళ్ళు, వ్యాపార దుకాణాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు.
**ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కామెంట్స్ :** ఎంతో పేరుగాంచిన గుడివాడను.. పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరిలో చైతన్యం కలిగించేలా.. ఐ లవ్ గుడివాడ ప్రాజెక్ట్ ను ప్రారంభించామన్నారు. మన ఇంటితో పాటు.. మన పరిసరాలకు కూడా ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పురపాలక సంఘ వాహనాల ద్వారా ప్రతిరోజు చెత్తను సేకరిస్తున్న.. అవగాహన లేమితో రోడ్లపై చెత్త వేయడం ప్రజలకు అలవాటుగా మారిందన్నారు. ఈ క్రమంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వెయ్యడంతో రోడ్లన్నీ అపరిశుభ్రంగా మారాయన్నారు. ఎంతో పేరుగాంచిన గుడివాడ ఖ్యాతిని మరింత పెంపొందించుకునేలా.. ప్రజలందరూ చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఐ లవ్ గుడివాడ కార్యక్రమంలో మాజీ మినిస్టర్ పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రమణ్యం, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, సీనియర్ టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు దారం నరసింహారావు, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళీ, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడాలి రామరాజు, పలువురు మున్సిపల్ అధికారులు ఎన్డీఏ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# విడాకుల గురించి ముందే హింట్ ఇచ్చిన రామ్ చరణ్



ఇటీవల కాలంలో విడాకులు తీసుకునే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. అందులోనూ సెలబ్రిటీల గురించి అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేకుండాపోయింది. ఏ రోజు ఏ సెలబ్రిటీ విడాకులు గురించి ప్రకటిస్తారో అనే విధాంగా పరిస్థితి మారిపోయింది. కలిసి ఉండలేక స్టార్స్ ఇలా విడాకుల బాట పడుతున్నారు. చాలామంది సెలబ్రిటీల జీవితాలు ఇలాగే ఉన్నాయి. తమ లైఫ్ పార్టనర్‌తో రాజీ పడకపోవడం, అత్తింటి గొడవలు ,పెళ్లి తరువాత కూడా కెరీర్ కొనసాగించడం, పర్సనల్ లైఫ్‌ను మెయిన్‌టైయిన్ చేయడం మొదలగు కారణాలతో విడాకులు బాట పడుతున్నారు. భాషతో సంబంధం లేకుండా సెలబ్రిటీలు చాలామంది విడాకులు తీసుకుంటున్నారు. సూపర్ స్టార్లు సైతం తమ వైవాహిక జీవితానికి గుడ్ బై చెప్పి ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. చిరంజీవి కూతురు శ్రీజ, నాగబాబు కూతురు నిహారిక, నాగార్జున కొడుకు నాగచైతన్య, మోహన్ బాబు కొడుకు

**వార్తాప్రభ సినిమా..**

మనోజ్, రజనీకాంత్ కూతురు ఐశ్వర్య , పవన్ కళ్యాణ్ వంటి వారు విడాకులు తీసుకున్న వారి జాబితాలో ఉన్నారు. తాజాగా నటాషా – హార్దిక్ పాండ్యలు సైతం విడాకులు తీసుకున్నారు.

# నరేష్‌ను వదిలేసిన పవిత్రా లోకేష్?

హీరో నుంచి క్యారెక్టర్ నటుడిగా మారిన నరేష్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరంలేదు. కామెడీ హీరోగా ఎన్నో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించాడు. క్యారెక్టర్ నటుడైన తర్వాత పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేస్తూ ఆ పాత్రను రక్తి కట్టిస్తూ దర్శకులకు ఎక్కువగా ఇష్టపడే నటుడిగా మారారు. నరేష్ అనగానే మనకు మరో పేరు కూడా గుర్తుకు వస్తుంది. ఆ పేరు ఎవరిదంటే పవిత్రా లోకేష్. వీరి ప్రేమ వ్యవహారం దక్షిణ భారతదేశంలో అత్యంత పాపులరైంది. నరేష్ మూడో భార్య రమ్య రఘుపతి చేసిన గొడవ కూడా అంతకుమించి పాపులర్ అయింది. ప్రస్తుతం సహజీవనం చేస్తున్నారు రమ్య రఘుపతి నుంచి విడాకులు రాకపోవడంతో ప్రస్తుతం ఈ జంట సహజీవనం చేస్తోంది. తానాగా నరేష్ విలపిస్తున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. నాగేశ్వర్ గారూ.. తమ బేబీ, బుజ్జి ఎటో వెళ్లిపోయిందని, అది లేకుండా తాను అన్నం కూడా తినలేనని, అకస్మాత్తుగా తనను వదిలి వెళ్లిపోయిందని, అన్ని చోట్లా తిరిగి, అందరినీ కనుక్కున్నానని, కానీ బేబీ ఎవరో తెలియదంటూ హేళన చేస్తున్నారంటూ కళ్లమ్మట నీళ్లు పెట్టుకున్నారు. దీంతో ఈ వీడియో చూసినవారంతా పవిత్రా లోకేష్ నరేష్ ను వదిలేసి వెళ్లిపోయిందని భావించారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు చేస్తున్నారు. వీరాంజనేయులు సినిమా ప్రమోషన్ లో భాగంగా అయితే అదంతా నిజమైంది కాదని, నరేష్ కీలక పాత్ర పోషిస్తున్న వీరాంజనేయులు సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఆయన ఈ వీడియో చేసి విడుదల చేశారు. త్వరలోనే ఈ సినిమా నేరుగా ఓటీటీలో ప్రసారం కాబోతోంది. దీంతో ఈ విషయం తెలుసుకున్నవారంతా షాక్ అవుతున్నారు.
కొంతమంది అయితే పవిత్రా లోకేష్ వెళ్లిపోవడంవల్ల నరేష్ కు మంచే జరిగిందంటూ కామెంట్లు పెడుతున్నారు. అయితే మరికొందరు మాత్రం ఈ ప్రేమజంట మధ్య ఎడబాటు రాదని, వీరిద్దరూ వివాహం చేసుకుంటారా? లేదా? అనేది కాలమే నిర్ణయిస్తుందంటూ కామెంట్లు పెట్టారు. చివరకు బుజ్జి పేరుతో చేసిన ప్రచారం కూడా ఈ జంటకు కలిసివచ్చిందని మరికొందరు అంటున్నారు.

# శిధిలావస్థకు చేరిన వాణిజ్య భవనాలను తొలగిస్తాం..

● ఆరు నెలల్లో పునర్ నిర్మించి లీజు దారులకు అప్పగిస్తాం..

● మున్సిపల్ షాపుల లీజుదారులతో.. సమావేశమైన ఎమ్మెల్యే రాము, అధికారులు..



**గుడివాడ,జూలై 20 (వార్తాప్రభ) :** గుడివాడ పట్టణంలోని మహాత్మా గాంధీ, ఎస్పీఎస్ మున్సిపల్ తదితర మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల దుకాణాల లీజుదారులతో మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పురపాలక సంఘ అధికారులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భవనాల ప్రస్తుత పరిస్థితిపై పి.వి సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వి.రంగారావు. ఎమ్మెల్యే రాము మరియు అధికారులకు వివరించారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న దుకాణాల లీజు దారులతో ఎమ్మెల్యే రాము మాట్లాడారు.. ప్రజల ప్రాణ సంరక్షణను దృష్టిలో ఉంచుకొని నిబంధన ప్రకారంగానే తదిపరి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రాము, అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీడియాతో మాట్లాడుతూ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న భవనాలను తొలగించి.. ఆధునిక పద్ధతుల్లో ఆరు నెలల్లో నిర్మాణం పూర్తిచేసి ప్రస్తుత లిజు దారులకే తిరిగి నిబంధనల ప్రకారంగా అప్పగిస్తామన్నారు. కమిషనర్ బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నిపుణుల సూచనల మేరకు ప్రభుత్వ భవనాలపై ఉన్న వాణిజ్య హోల్డింగ్స్ ను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, డి.ఈ. ప్రవీణ్, ఇతర మున్సిపల్ అధికారులు, దుకాణా లీజుదారులు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ ప్రారంభోత్సవానికి.. కోటిన్నర మున్సిపల్ జనరల్ ఫండ్స్ వినియోగంపై విచారణ..

● కాలనీ సమస్యలపై అధికారులు.. కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో ఎమ్మెల్యే రాము సమావేశం..



**గుడివాడ,జూలై 20 (వార్తాప్రభ) :** ప్రజల చిన్నపాటి సమస్యలు పరిష్కరించకుండా.. కేవలం కాలనీ ప్రారంభోత్సవానికి గత ప్రభుత్వ పెద్దలు కోటిన్నర పురపాలక సంఘ జనరల్ ఫండ్స్ వినియోగించడాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తప్పుబట్టారు.. ఈ వ్యవహారంపై విచారణ చేయిస్తామని ఆయన పేర్కొన్నారు. గుడివాడ పట్టణం మల్లాయపాలెం టీడ్కో కాలనీ నివాసతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై గుడివాడ పురపాలక సంఘ కార్యాలయంలో పురపాలక సంఘ, టీడ్కో అధికారులు, మరియు కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో ఎమ్మెల్యే రాము శనివారం సమావేశమయ్యారు. వారం రోజులుగా కాలనీ నివాసితులు త్రాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న చర్యలు తీసుకోకపోవడంపై ఎమ్మెల్యే రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ శాఖలు మరియు కాంట్రాక్ట్ సంస్థలు పొంతన లేని సమాధానం చెప్పడంతో ఎమ్మెల్యే రాము మండిపడ్డారు. గత ప్రభుత్వ తప్పిదాలపై తాను వివరణ కోరడం లేదని.. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సమావేశంలో స్పష్టం చేశారు. టీడ్కో కాలనీలో ప్రధాన నిర్మాణాలను క్వాలిటీ కంట్రోల్ నిపుణులతో పరీక్షలు చేయించాలని అధికారులను ఎమ్మెల్యే రాము ఆదేశించారు. కాలనీలో భవనాలు మరియు అభివృద్ధి పనులు, త్రాగునీటి ప్రాజెక్టుల మరమ్మత్తులన్నింటిని కాంట్రాక్టు సంస్థలు పూర్తిచేసి.. పది రోజుల్లో పురపాలక సంఘానికి అప్పగించి తీరాలని సమావేశంలో ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, డి.ఈ. ప్రవీణ్, టీడ్కో ఎస్.ఈ. బి.చిన్నోడు, డిఇ శాంత కుమార్ ,ఏ.ఈ. సురేష్ బాబు, కాంట్రాక్టు సంస్థలైన కె.ఎన్.బి. మరియు ఏఎన్‌జె కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారము

● సంస్థ వ్యవస్థాపకులు కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఎన్. రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో..

● ఘనంగా ఉమ్మడి కృష్ణాజిల్లా నూతన ప్రెసిడెంట్ గా దండమూడి జయలక్ష్మి ప్రమాణ స్వీకారం..





**గుడివాడ,జూలై 20 (వార్తాప్రభ) :** శనివారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారము 2024-25 వ సంవత్సరానికి సంస్థ వ్యవస్థాపకులు కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఎన్. రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం జరిగినది. ఈ సభకు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ మండలాల నుండి నుండి సంఘ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సభకు ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ పొట్లూరి వీర శేషగిరిరావు అధ్యక్షత వహించగా వ్యవస్థాపకులు ఎన్ రామచంద్రారెడ్డి, కృష్ణాజిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ జాతీయ ఉత్తమ రాష్ట్రపతి అవార్డు గ్రహీత మారు బోయిన కోటేశ్వరావు లు ప్రసంగించారు. ముఖ్యంగా ఎం రామచంద్రా రెడ్డి ఉపనిషత్తుల మీద అద్భుతముగా ప్రవచనము చేయడం జరిగినది. ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ఆంధ్ర ప్రదేశ్ టెక్నీషియన్, ఇంటర్నేషనల్ మిమిక్రీ ఆర్టిస్ట్ భవిరి రవి అద్భుతంగా మిమిక్రీ చేశారు. లయన్ గుత్తికొండ సుభాష్ చంద్రబోస్ అద్భుతంగా ప్రసంగించారు. ప్రమాణస్వీకారానంతరము ఉమ్మడి కృష్ణాజిల్లా నూతన ప్రెసిడెంట్ దండమూడి జయలక్ష్మి నూతన యూనిట్స్ ను ప్రారంభించడానికి కృషి చేస్తామని సభా ముఖంగా తెలియజేసారు. యూనిట్స్ ను బలోపేతం చేస్తామని, సేవా కార్యక్రమాలు ఎక్కువగా చేసేటట్లు చేస్తామని, సభ్యులను ఎక్కువ మందిని ఇన్వాల్వ్ చేస్తామని చెప్పడం జరిగినది. కార్యదర్శిగా శీతాల ప్రసాద్ (పామర్రు), కోశాధికారిగా జె.వి.వి. సత్యనారాయణ (హనుమాన్‌జంక్షన్), ఉపాధ్యక్షులుగా సి.బి.జి. బాబు (విజయవాడ), సహాయ కార్యదర్శిగా ముదిగొండ నాగ వీరభద్ర శాస్త్రి (మచిలీపట్నం), కార్యవర్గ సభ్యులుగా బత్తుల అనూరాధ (నూజివీడు-విద్య), గుర్రం శ్యామ్ (కైకలూరు -వైద్యం), గోదావరి సత్యనారాయణ (కలిదిండి-ఎవేర్నెస్), మడుపల్లి బాల కృష్ణ (గన్నవరం-ఎమర్జెన్సీ) లు ప్రమాణ స్వీకారం చేసారు. కార్యక్రమంలో ఆర్థిక సహాయము 5000 రూపాయలు వైద్య ఖర్చులు నిమిత్తమై బొడ్డు పద్మావతికి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గుడివాడ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మొట్టమొదటి అధ్యక్షుడు గుత్తా రమేష్, గుడివాడ మానవతా సంస్థ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, కో చైర్మన్ మారుతి ప్రసాద్, సెక్రటరీ నందమూరి పద్మజ, వైస్ ప్రెసిడెంట్ జాయింట్ సెక్రెటరీ వెంకట మోహన్, కోశాధికారి గంట చంద్రశేఖర రావు, కార్యవర్గ సభ్యులు ఘంటసాల రామకృష్ణ, బి రాధాకృష్ణ అడ్వైజర్ బోర్డు సభ్యులు గుత్తా లక్ష్మి పావని ప్రసాద్, గౌరవ అధ్యక్షులు మాగంటి రంగనాథ్, ఇతర సభ్యులు అసోసియేట్ ప్రొఫెసర్ ఇంజనీరింగ్ కాలేజ్ సురేంద్రబాబు, నవీన్ నవ్వుల సత్యాన్న బాబు, కొమ్ము వెంకటేశ్వరరావు, దుద్దు వెంకటేశ్వరరావు, ఇతర సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కృత్తివెన్ను మండలంలో సహకార వడ్డీ మాఫీ చెక్కుల పంపిణీ



**కృత్తివెన్ను,జూలై 20 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా కృత్తివెన్ను మం డలం లో శనివారం నాడు సహకార రుణాలు సంబంధిం చిన వడ్డీ మాఫీ చెక్కులను శాసనస భ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అందజేశారు. కృత్తివెన్ను గ్రామము కొమాళ్ళపూడి శ్రీ కృష్ణా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘము సొసైటీ నందు సభ్యులు పంట ఋణములు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులకు ఈ పథకాన్ని అమలు చేశారు. వడ్డీ మాఫీ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వాటా అయిన 3 శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం విడుదల చేసింది.2020-21 మరియు 2021-22 సంవత్సరములకు గానూ 279 మంది రైతులకు రూ. 6,09,418 పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఒడుగు తులసిరావు ప్రధాన కార్యదర్శి పిన్నింటి రత్తయ్య సంఘ పర్సన్ ఇంచార్జ్ రొండి అచ్యుత్ బంటుమిల్లి కె డి సి సి బ్రాంచ్ – బ్యాంకు మేనేజర్ సి హెచ్ వెంకట రమేష్ నాయుడు సంఘ సిఈఓ పీవీ సత్య నారాయణ చేతులమీదుగా చెక్కుల పంపిణి కార్యక్రమం జరిగినది.

# పెడన బ్రాంచ్ సహకార సంఘ ఉద్యోగుల కమిటీ ఏర్పాటు



**పెడన,జూలై 20 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పెడన బ్రాంచ్ పరిధిలోని సహకార సంఘాల ఉద్యోగుల నూతన కమిటీని శనివారం నాడు ఏర్పాటు చేశారు. బ్రాంచ్ పరిధిలో ఉన్న 15 సంఘాల నుంచి ఈ కమిటీలోకి తీసుకున్నారు. నందమూరు గ్రామ విశాల సకార పరపతి సంఘం ఫంక్షన్ హాల్ లో ఉద్యోగులు సమావేశమై ఏకగ్రీవంగా కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షునిగా నిమ్మగడ్డ భోగేంద్ర రావు (బుద్దాలపాలెం )ఉపాధ్యక్షునిగా మట్టా రవికుమార్ (పెడన) జాయింట్ సెక్రటరీగా కుమారి (రామానుజ వత్తర్లపల్లి ) కోశాధికారిగా పీవీ సత్యనారాయణ (కవిపురం )ఎన్నిక కాగా సభ్యులుగా కే శ్రీనివాసరావు దేవదానం చింతామురళి బడే గంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీని సంఘం నాయకులు జన్యావుల రామాంజనేయులు యార్లగడ్డ రామ్మోహన్ రావు మెట్ల శ్రీనివాసరావు వెంకటరత్నం పలువురు ఇతర ఉద్యోగులు అభినందించారు.

# గుడివాడ అర్బన్ బ్యాంక్ పర్సన్ ఇంచార్జ్ గా బాధ్యతలు చేపట్టిన డి.విజయ్ కుమార్



**గుడివాడ,జూలై 20 (వార్తాప్రభ) :** పట్టణంలో ప్రాముఖ్యత కలిగిన ది గుడివాడ అర్బన్ బ్యాంక్ పర్సన్ ఇంచార్జ్ గా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ డి. విజయ్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణాజిల్లాలోని ప్రతిష్టాత్మకమైన అర్బన్ బ్యాంక్ అభివృద్ధికి శక్తివంతం లేకుండా కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా లోన్ రికవరీలో బ్యాంకు వెనుకబడినట్లు గుర్తించానని.. సిబ్బంది సహకారంతో లోన్ రికవరీలో మంచి ఫలితాలు తీసుకొస్తానన్నారు. అలాగే ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంతోపాటుగా.. గోల్డ్ మరియు మార్టిగేజ్ లోన్లను వేగవంతంగా మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా గుడివాడ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రత్యేకతను మరింత పెంపొందించేలా పనిచేస్తానని విజయ్ కుమార్ పేర్కొన్నారు.

# జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీకి ఎంపికైన వీ.కే.ఆర్ ఇంజినీరింగ్ అధ్యాపకులు కొడవలి జీవన్ కుమార్




**గుడివాడ,జూలై 20 (వార్తాప్రభ) :** స్థానిక వీ.కే.ఆర్ అండ్ వీ.యన్.బి ఇంజినీరింగ్ కళాశాలలోని బీ.టెక్ కంప్యూటర్స్ డేటా సైన్సెస్ విభాగాధిపతి కొడవలి జీవన్ కుమార్ ఇటీవల మంగళగిరిలో జరిగిన రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీలలో స్వర్ణ పతకాన్ని పొంది ఈ నెల 21వ తారీకు నుండి మధ్య ప్రదేశ్ లోని ఇండోర్ లో జరగబోవు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి ఎంపికయ్యారు. ఇప్పటివరకు వీరు వివిధ విశ్వవిద్యాలయ మరియు రాష్ట్ర స్థాయి పోటీలలో ఆరు స్వర్ణ పతకాలను కైవసం చేసుకోవడం జరిగింది. జాతీయ స్థాయి పోటీలకు జీవన్ కుమార్ ఎంపికవ్వడం పట్ల కళాశాల సెక్రటరి మరియు కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డా॥ ఎస్.హెచ్.వి.ప్రసాదరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు హర్షం వెలిబుచ్చారు.

# "నీట్" లో ప్రతిభ కనబరచినవిద్యార్థినికి రోటరీ క్లబ్ ఆర్థిక సాయం...

● రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో 35వేలు అందజేత...



**కాకినాడ,జూలై 20 (వార్తాప్రభ) :** రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ, ప్రెసిడెంట్ ఆర్టిఎన్ శిష్టా శ్రీకాంత్ సారథ్యంలో, అర్హులైన విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించడం ద్వారా విద్య మరియు సమాజ సేవలో తమ నిబద్ధతను ప్రదర్శించారు. ఇటీవల శ్రీ చైతన్య బైపిసి మెడికాన్ NEET బ్యాచ్‌లోప్రతిభ కనబరచిన విద్యార్థిని ఆర్థికంగా వెనుకబడిన నేపథ్యం నుండి వచ్చినప్పటికీ, ఈ విద్యార్థి తన మొదటి సంవత్సరంలో 420/440 మార్కులు సాధించి, విద్యాపరంగా ప్రతిభ కనబరిచారు. అయితే రెండో సంవత్సరంలో చదువు కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది.ఆమె రెండవ సంవత్సరం ఫీజుతో సహాయం కోసం ఆమె చేసిన అభ్యర్థనకు ప్రతిస్పందనగా, మా గౌరవనీయ సభ్యులు వెంటనే చర్య తీసుకున్నారు. ఆరు గంటలలోపు, విద్యార్థి యొక్క విద్యా ప్రయాణం అంతరాయం లేకుండా కొనసాగుతుందని ధైర్యం చెప్పి ఉదారంగా 35,000 ముప్పై ఐదు వేల రూపాయలు సమకూర్చి ఆమెకు అందజేశారు.ఈ ప్రతిభావంతులైన విద్యార్థికి మద్దతు ఇవ్వడంలో "మా: సమిష్టి కృషి విద్యను పెంపొందించడానికి మరియు సానుకూల ప్రభావాన్ని చూపడానికి మా నిబద్ధతను నొక్కి చెబుతుంది అని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ సభ్యులందరికీ వారి సత్వర మరియు ఉదార ??సహకారాలకు మరియు అనుసూరి ప్రభాకర్ ఈ సమస్యని మా దృష్టికి తీసుకువచ్చిన అందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేసారు. ఈ సమావేశంలో కాకినాడ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ బి. నరసింహానాయక్, పీడీజీ డాక్టర్ ఎస్‌వీఎస్ రావు, ప్రెసిడెంట్ ఆర్‌టీఎన్ సిస్ట శ్రీకాంత్, సెక్రటరీ దామెర్ల శ్రీకాంత్, ఆర్టీఎన్ డాక్టర్ ఎస్‌సీహెచ్ రామకృష్ణ, ఆర్టీఎన్ చిక్కాల తాతాజీ పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు శానిటరీ సామాగ్రి పంపిణీ




**విస్సన్నపేట ,జూలై 20 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు పంపిణీ చేశారు. రైన్ కోట్లు ఫస్ట్ ఎయిడ్ కిట్లు తదితరాలను కూడా అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మందపాటి సత్యనారాయణ రెడ్డి ఈవో హరికృష్ణ పట్టణ వైసిపి అధ్యక్షులు నెక్కలపు వెంకట కుటుంబరావు కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188